విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 241 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | మార్చి 2025 | వెల : రూ 10/-




## అజేయ శక్తిగా ఎదుగుతున్న భారత్

- కుంభమేళాతో నైపుణ్యాన్ని చాటాం
- ఎన్ఎక్స్టీ కాంక్లేవ్ 2025 లో ప్రధానమంత్రి మోడీ

న్యూఢిల్లీ,

ఇన్నేళ్లు శ్రామిక శక్తిగా పేరుపొందిన భారతదేశం ప్రస్తుతం ప్రపంచ శక్తిగా రూపొందుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇటీవల పెద్దఎత్తున మహాకుంభమేళా నిర్వహించి నిర్వహణా -మిగతా 3 లో



## మల్టీప్లెక్స్‌లకు ఊరట

- 16ఏళ్లలోపు పిల్లలకు అనుమతి..
- తదుపరి విచారణ 17కు విచారణ

హైదరాబాద్,

మల్టీప్లెక్స్‌లకు హైకోర్టులో ఊరట లభించింది. 16 సంవత్సరాలలోపు చిన్నారులను అన్ని షోలకు అనుమతించాలని ఆదేశించింది. జనవరి 21న ఇచ్చిన ఉత్తర్వులను న్యాయస్థానం సవరించింది. అయితే ప్రీమియర్, బెనిఫిట్ స్పెషల్ షోలకు మాత్రం పిల్లల అనుమతికి హైకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణను ఈ నెల17కు హైకోర్టు ధర్మాసనం -మిగతా 3 లో




## బీజేపీ వర్సెస్ కాంగ్రెస్

- మామునూర్ ఎయిర్‌పోర్ట్ ఘనత మాదే
- కాంగ్రెస్, బీజేపీల పరస్పర ఘర్షణ

వరంగల్,

మామునూర్ ఎయిర్‌పోర్టు ప్రాంగణం దగ్గర తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. మామునూరు ఎయిర్ పోర్ట్‌కు ఆమోదం రావడంతో కాంగ్రెస్, బీజేపీ ఆధ్వర్యంలో వేరువేరుగా సంబరాలు చేసుకుంటున్నారు. ఒకే సమయంలో ఎయిర్ పోర్ట్ ప్రధాన గేటు వద్దకు కాంగ్రెస్, బీజేపీ నేతలు.. కార్యకర్తలు చేరుకున్నారు. -మిగతా 3 లో




### ఇసుక అక్రమ రవాణాపై

# ఉక్కుపాదం



- ప్రభుత్వం చేపట్టే పనులకు అందుబాటులో ఇసుక
- మైనర్ ఖనిజాల వేలానికి వెంటనే టెండర్లను పిలవాలి‘
- ఇసుక స్టాక్ పాయింట్లు సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలి
- అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్

హైదరాబాద్,

ఇసుక, ఖనిజాల అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపాలని అధికారులను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వం చేపట్టే పనులకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ నుంచే ఇసుక సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ఖనిజాభివృద్ధి శాఖపై నిర్వహించిన సమీక్షలో సీఎం మాట్లాడారు. ‘నిర్మాణరంగ సంస్థలకు అవసరమైన ఇసుకను ప్రభుత్వమే -మిగతా 3 లో





## త్వరలో ఉప ఎన్నికలు తప్పవు

- మంచి చెప్పడానికి రేవంత్ చేసిందేమీ లేదు
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్ వ్యాఖ్యలు

హైదరాబాద్,

త్వరలో ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోమారు అన్నారు.కాంగ్రెస్ మీటింగ్ లో మూడు ఆణిముత్యాల మాటలు చెప్పారు.. మంచి మైక్‌లో చెప్పాలి చెడు చెవిలో చెప్పాలి అన్నారు.. మంచి చెప్పడానికి నువ్వు చేసిన ఒక్క మంచి పని లేదని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి చేసిన చెడు చెబితే.. చెవిలో రక్తాలు -మిగతా 3 లో

## కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న సస్పెండ్

- ఆదేశాలు జారీ చేసిన కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి

హైదరాబాద్,

కాంగ్రెస్ పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిచినందుకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేశారు. ఈమేరకు ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రవర్తించడమే కాకుండా బీసీ కులగణన ప్రతులు చించడంపై ఆ పార్టీ అధిష్టానం సీరియస్ అయింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ -మిగతా 3 లో





## టన్నెల్ దగ్గర కొనసాగుతున్న సహాయక చర్యలు

- ఘటనాస్థలికి చేరుకున్న ఉస్మానియా ఫోరెన్సిక్ వైద్యులు
- ఇదిలా ఉంటే టెన్నల్ దగ్గర ఇప్పటికే మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు చేరుకున్నారు

మహబూబ్‌నగర్,

శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ దగ్గరకు ఉస్మానియా ఫోరెన్సిక్ వైద్యులు చేరుకున్నారు. ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ శ్రీధర్ చారితో పాటు ఇద్దరు ఫ్యాకల్టీ, ఇద్దరు పీజీ వైద్యులు -మిగతా 3 లో



## మణిపూర్‌లో దారికొస్తున్న పరిస్థితులు

- 8 నుంచి రవాణాకు అనుమతులు
- ఉన్నతస్థాయిలో సమీక్షించిన హోంమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ,

గత రెండేళ్లుగా జాతుల మధ్య వైరంతో అల్లకల్లోలంగా మారిన మణిపుర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా కేంద్రం కృషి చేస్తోంది. ఇప్పుడు అక్కడ రాష్ట్రపతి పాలన కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్రంలోని భద్రతా పరిస్థితులపై ఉన్నత స్థాయి అధికారులతో -మిగతా 3 లో

### రేంవత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్

# రాజకీయాలు

- హామీలు అమలు చేయలేక తనపై విమర్శలు
- అబద్దాలు ప్రచారం చేస్తే ప్రజలను నమ్మరు
- సీఎం రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి ఘాటు విమర్శలు





హైదరాబాద్,

ఇచ్చిన హామీలు అమలు చేయలేక చతికిల పడ్డ సిఎం రేవంత్ రెడ్డి తనపై పడి ఏడుస్తున్నాడని, వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారని, అబద్దాలు చెప్పినంత మాత్రాన రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత తగ్గదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి -మిగతా 3 లో

# ఈ ఎండాకాలంలో మండుటెండలు తప్పవు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి



హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ

ఈ ఎండాకాలం మండుటెండలు తప్పవని, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత సాధారణం కంటే అధికంగా ఉంటుందని.. వడగాలులు కూడా తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఏప్రిల్, మే నెల వచ్చేసరికి 44 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 1901 నుంచి 2025 వరకు సరాసరి సగటు తీసుకుంటే ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ప్రధానంగా దక్షిణ, మధ్య తెలంగాణతో పాటు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని వెల్లడించింది. దక్షిణ, ఉత్తర తెలంగాణలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు సైతం సాధారణం కంటే రెండు డిగ్రీలు పెరిగే సూచనలున్నాయని తెలిపింది. 125 సంవత్సరాల సరాసరి సగటు తీసుకుంటే గాలిలో తేమ చాలా తగ్గిందని పేర్కొ

# మహిళాదినోత్సవ కానుకగా పలు కార్యక్రమాలు

8న పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించనున్న సిఎం రేవంత్



హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మహిళలకు గుడ్ న్యూస్ అందించబోతోంది. మహిళలకు అండగా నిలిచి వారి అభివృద్ధికి బాసటగా నిలిచేందుకు పలు పథకాలను ప్రారంభించనున్నది. ఇప్పటికే మహిళల కోసం మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇక ఇప్పుడు మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అద్భుతమైన పథకాలను ప్రారంభించేందుకు రేవంత్ సర్కార్ రెడీ అయ్యింది. తెలంగాణ ప్రభుత్వం మార్చి 8న పరేడ్ గ్రౌండ్ లో పలు పథకాలకు శ్రీకారం చుట్టనున్నది. మహిళలపై వరాలు కురిపించనున్నది. మహిళా సంఘాలచే ఆర్టీసీ అద్దె బస్సులు ప్రారంభించనున్నది. మొదటి విడతలో 50 బస్సులకు పచ్చా జెండా ఊపి సీఎం రేవంత్ ప్రారంభించనున్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు చెల్లింపులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు. 31 జిల్లాల్లో మహిళా సంఘాలచే పెట్రోల్ బంకుల ఏర్పాటు కోసం అయిల్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకోనున్నది. 32 జిల్లాల్లో జిల్లాకు 2 మెగా వాట్ల చొప్పున 64 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లకు వర్చువల్ గా శంకు స్థాపన చేయనున్నారు. ధీరా మహిళా శక్తి 2025 విడుదల చేయనుంది ప్రభుత్వం. 14 వేల అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల భర్తీకి సంబంధించి నియామక నోటిఫికేషన్ ను జారీ చేయనున్నారు.

# రాహుల్ గాంధీ ఆదేశాల మేరకే తీన్మార్ మల్లన్న సస్పెండ్

– టీ పీసీసీ చీఫ్




హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

: కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సస్పెన్షన్‌పై టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. తీన్మార్ మల్లన్న విషయంలో ఏఐసీసీ నిర్ణయం తీసుకుందన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాలతోనే తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరించేవారికి ఇది ఒక హెచ్చరిక అని ఆయన తెలిపారు. భవిష్యత్‌లో ఎవరైనా పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవని మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు.కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఆ పార్టీ వేటు వేసిన సంగతి తెలిసిందే. తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 5న తీన్మార్ మల్లన్నకు కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ వ్యతిరేక చర్యలపై మల్లన్నను కమిటీ వివరణ కోరింది. ఫిబ్రవరి 12వ తేదీలోపు వివరణ ఇవ్వాలని మల్లన్నకు కమిటీ గడువు ఇచ్చింది. వివరణ ఇవ్వకపోవడంతో తీన్మార్ మల్లన్నపై కాంగ్రెస్ పార్టీ వేటు వేసింది.

# ప్రజల వద్ద రూ.6400 కోట్ల విలువైన 2వేల నోట్లు

–మరోమారు మార్చుకునే అవకాశం ఇచ్చిన ఆర్‌బిఐ




న్యూఢిల్లీ,

దేశంలో రూ.2వేల విలువైన కరెన్సీ నోటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉపసంహరించుకుని దాదాపు 20 నెలల పైనే అయినా ఇంకా రూ.6400 కోట్ల విలువైన నోట్లు ప్రజల చేతుల్లోనే ఉన్నాయని తాజాగా ఆర్‌బీఐ వెల్లడించింది. చలామణీలో ఉన్న వాటిల్లో 98.18 శాతం నోట్లు తిరిగి బ్యాంకుల వద్దకు చేరినట్లు కేంద్ర బ్యాంకు తెలిపింది. రూ.2వేల విలువైన నోటును ఉపసంహరించు కుంటున్నట్లు 2023 మే 19న ఆర్‌బీఐ ప్రకటించింది. ఆ నిర్ణయం వెలువడే నాటికి రూ.3.56 లక్షల కోట్ల విలువైన నోట్లు చలామణీలో ఉన్నాయి. తొలుత బ్యాంకుల్లో నోట్ల మార్పిడి/డిపాజిట్‌కు ప్రజలకు 2023 సెప్టెంబర్ 30 వరకు అవకాశం ఇచ్చారు. అనంతరం అదే ఏడాది అక్టోబర్ 7 వరకు ఆ గడువును పొడిగించారు. ఆ తర్వాత నుంచి ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో మాత్రమే ఈ నోట్లను స్వీకరిస్తున్నారు. అలా ఫిబ్రవరి 28, 2025 వరకు 98.18 శాతం నోట్లు బ్యాంకులను చేరినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఇంకా రూ.6471 కోట్ల నోట్లు ప్రజల వద్దే ఉన్నట్లు తెలిపింది. ఆర్‌ఐబీ ప్రాంతీయ కార్యాలయాల వద్ద నోట్లను మార్పిడి/ డిపాజిట్ చేసుకోవచ్చని కేంద్ర బ్యాంక్ తెలిపింది. రీజనల్ ఆఫీసులకు చేరుకోలేనివారు పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఆయా కార్యాలయాలకు పంపొచ్చని పేర్కొంది. హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, బేల్‌పుర్, భోపాల్, భువనేశ్వర్, ఛండీగడ్, చెన్నై, గువాహటి, జైపుర్, జమ్మూ, కాన్పుర్, కోల్‌కతా, లఖ్‌నవూ, ముంబయి, నాగ్‌పుర్, దిల్లీ, పట్నా, తిరువనంతపురంలో ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి

# 15 ఏళ్లు పైబడ్డ వాహనాలకు నో పెట్రోల్

ఢిల్లీలో కాలుష్య నివారణకు చర్యలు



న్యూఢిల్లీ,ప్రజా స్వేచ్ఛ

దేశ రాజధాని దిల్లీ లో కాలుష్య నివారణకు చ ర్యలు మొదలయ్యాయి. ఇందులో బాగంగా కొత్తగా కొలువుదీరిన కొత్త ప్రభుత్వం కీలక నిర్ణయాలు ప్రకటించింది. కాలుష్య కట్టడి చర్యల్లో భాగంగా శనివారం పర్యావరణ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సాతో అధికారులు భేటీ అయ్యారు. 15 ఏళ్లు పైబడిన వాహనాలకు మార్చి 31 తర్వాత బంకుల్లో ఇంధనం పోయకూడదంటూ ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. 'పెట్రోల్ బంకుల వద్ద గాడ్జెట్‌లు ఏర్పాటు చేస్తాం. 15 ఏళ్లు పైబడిన వాహనాలను అవి గుర్తిస్తాయి. దాంతో వాటికి ఇంధనం అందదని మంత్రి వెల్లడించారు. ఈ ఆంక్షలకు సంబంధించి కేంద్ర పెట్రోలియం శాఖకు సమాచారం ఇస్తామని తెలిపారు. అలాగే ఎత్తైన భవనాలు, హోటళ్లు, వాణిజ్య సముదాయాల్లో తప్పకుండా యాంటీ స్మోగ్ గన్లను అమర్చాలని వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి 90 శాతం సీఎన్‌జీ బస్సులను దశలవారీగా ఉపసంహరించుకొని, ఎలక్ట్రిక్ బస్సులతో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతిఏటా శీతాకాలం సమయంలో దిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుపోతోంది. వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలిక చర్యలకే ప్రాధాన్యమిస్తున్నాయి తప్పితే శాశ్వత చర్యలపై దృష్టి సారించడం లేదు. దాంతో నగరవాసులు స్వచ్ఛమైన గాలి అందక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. విద్యా సంస్థలను మూసి వేయాల్సి వస్తోంది. విమానాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దాంతో జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే ప్రధాన అంశమైంది. కాలుష్య కట్టడికి ఆప్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదంటూ ప్రచారంలో భాగంగా భాజపా విమర్శలు గుప్పించింది. ఇప్పుడు అధికారంలోకి రాగానే ఆ దిశగా పలు చర్యలు ప్రారంభించింది. కొత్త ప్రభుత్వం కేంద్రం తీసుకువచ్చిన తుక్కు విధానాన్ని సమర్థవంతంగా అమలుచేయనున్నట్లు తెలుస్తోంది. తుక్కు విధానం వల్ల ఫిట్‌నెస్ లేని వాహనాలకు స్వస్తి పలకడంతో పాటు కాలుష్యం తగ్గడానికి దోహదపడనుంది.

# రాష్ట్రంలో పెరిగిన నేరాలు, హింసలు

శాంతియుత తెలంగాణలో ఒక్కసారిగా దాడులు : హరీశ్‌రావు



హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

ఏడాది కిందటి వరకు శాంతియుతంగా ఉన్న తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హింస, నేరాలు పెరిగిపోతున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని నార్యనాయక్ తండాలో తాజాగా బీఆర్ఎస్ కేడర్‌పై జరిగిన దాడే దీనికి నిదర్శనమని ఆయన చెప్పారు. కాంగ్రెస్ వస్తే మార్పు వస్తుందని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ శ్రేణులను ఉసిగొల్పుతూ నిజంగానే మార్పు తెచ్చారు. కాంగ్రెస్ మార్క్ ఎమర్జెన్సీని ఆ పార్టీ కొల్లాపూర్‌లో అమలు చేయిస్తోంది. సాతాపూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై దాడి జరిగి ఒక రోజు గడవక ముందే నార్యానాయక్ తండాలో కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోయారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు గర్హనీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరుల దాడులు పెరిగిపోతున్నా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రచారం చేసుకునే హక్కు ప్రతిపార్టీకి ఉంటుంది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడం ప్రతిపక్షాల కర్తవ్యం. బీఆర్ఎస్ ఈ పనులు చేస్తుంటే కాంగ్రెస్‌కు జీర్ణం కావడం లేదు. తమ వైఫల్యాలు ప్రజలకు తెలిస్తాయని భయపడుతూ దాడులుకు పాల్పడుతున్నది. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ. ఇలాంటి ఎన్నో అణచివేతలను ఎదుర్కొని నిలిచింది. దాడులకు, కేసులకు మా కార్యకర్తలు భయపడరు. బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుంది. పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకుని తమ కర్తవ్యం నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాను అని హరీశ్‌రావు తెలిపారు

# శరవేగంగా బులలెట్ ట్రైన్ పనులు

ఆనంద్‌లో పనులు పరిశీలించిన మంత్రి అశ్వీనీ వైష్ణవ్



న్యూఢిల్లీ,ప్రజా స్వేచ్ఛ

బుల్లెట్ రైలు సహా, అహ్మదాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు త్వరితగతిన జరుగుతున్నాయని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వీనీ వైష్ణ అన్నారు. శనివారం గుజరాత్‌లోని ఆనంద్‌లో బుల్లెట్ రైలు ప్రాజెక్టు పనులను అధికారులతో కలిసి సమీక్షించిన ఆయన.. నిర్మాణ పనులు వేగంగా చేపడుతున్న కార్మికులను ప్రశంసించారు. 360 కిలోమీటర్ల మేర ప్రాజెక్ట్ పూర్తయ్యిందన్న ఆయన.. బుల్లెట్ ట్రైన్ ఎప్పుడు పట్టాలెక్కనుందనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ముంబయి– అహ్మదాబాద్ బు÷–లలెట్ రైలు ప్రాజెక్ట్ కోసం నిర్మిస్తున్న 200 మీటర్ల పొడవైన స్టీల్ వంతెనను కేంద్ర మంత్రి సందర్శించారు. ఈ బ్రిడ్జ్ బరువు 1100 టన్నులకు పైగా బరువు ఉంటుందని తెలిపారు. టాటా, జేఎస్‌డబ్ల్యూ, సెయిల్ వంటి ప్రముఖ తయారీదారుల నుంచి ఉక్కును సేకరించి ఈ అధిక నాణ్యత గత సామగ్రిని ప్రాజెక్ట్ కోసం వినియోగించినట్లు ఆయన తెలిపారు. ఈ వంతెన కోసం పని చేస్తున్న శ్రామికులు, ఇంజనీర్లు గతంలో చీనాబ్, అజీ బ్రిడ్జ్ నిర్మాణంలో పనిచేశారని తెలిపారు. ఉద్ధవ్ ఠాక్రే హయాంలో ఈ ప్రాజెక్ట్ చేపట్టేందుకు ఎటువంటి సహకారం అందలేదన్న ఆయన.. ప్రస్తుతం ఉన్న దేవేంద్ర ఫడణవీస్ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. ఉద్ధవ్ ప్రభుత్వం వల్ల ఈ ప్రాజెక్ట్ రెండున్నరేళ్లు ఆలస్యం అయ్యిందన్నారు. బు÷–లలెట్ ప్రాజెక్ట్ కారిడార్ పొడవు 508 కిలోమీటర్లు.

# ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

(మొదటి తరువాయి)

సరఫరా చేయాలి. సరైన ధరలకు సరఫరా చేస్తే అక్రమాలకు ఆస్కారం ఉండదు. హైదరాబాద్ నగరానికి మూడు వైపులా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. క్వారీలకు జరిమానాలపై విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. మైనర్ ఖనిజాల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలి' అని సీఎం ఆదేశించారు. ఇసుకతో పాటు ఇతర ఖనిజాల అక్రమ తవ్వకాలు, అక్రమ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కఠిన చర్యలతోనే అక్రమాలను అడ్డుకోగలమని, ప్రభుత్వానికి ఆదాయం పెంచగలమన్నారు. తొలుత గత నెల రోజులుగా తీసుకున్న చర్యలతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడిన విధానాన్ని, పెరిగిన ఆదాయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, రవాణా, వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక సరఫరాపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. ప్రభుత్వంలోని నీటి పారుదల, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే పనులకు టీజీఎండీసీ నుంచే ఇసుక సరఫరా చేసేలా చూడాలన్నారు. పెద్ద మొత్తంలో నిర్మాణాలు చేపట్టే నిర్మాణ రంగ సంస్థలకు అవసరమైన ఇసుకను టీజీ ఎండీసీ ద్వారానే సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. సరైన ధరలకు ప్రభుత్వమే ఇసుక సరఫరా చేస్తే అక్రమంగా సరఫరా చేసే వారిపై వినియోగదారులు ఆధారపడరన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు సమీప ప్రాంతాల్లోనే ఇసుక ఎక్కువగా వినియోగం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తక్కువ మొత్తంలో ఇసుక అవసరమైన వారు కొనుగోలు చేసేలా నగరానికి మూడు వైపులా ఇసుక స్టాక్ పాయింట్లు సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. గనుల శాఖ పరిధిలోని వివిధ ఖనిజాల క్వారీలకు గతంలో విధించిన జరిమానాలు, వాటి వసూళ్లపైనా సీఎం అధికారులను ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన విధానపరమైన నిర్ణయం త్వరగా తీసుకొని సమస్యను పరిష్కరించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మైనర్ ఖనిజాల బ్లాక్‌ల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు.

# బీజేపీ వర్సెస్ కాంగ్రెస్

(మొదటి తరువాయి)

ఈ క్రమంలో ఇరు వర్గాలు భారీగా వచ్చారు. దీంతో.. ఇరు పార్టీల నేతలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. కాగా.. కార్యకర్తలు, నాయకుల మధ్య తోపులాట, ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న పోలీసులు.. అక్కడికి చేరుకుని శాంతింప చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మరోవైపు.. బీజేపీ నేతలు ప్రధాని మోడీకి పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. అటు.. సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి అదే చోట పాలాభిషేకం చేసేందుకు కాంగ్రెస్ నేతలు యత్నించారు. దీంతో.. రెండు వర్గాల మధ్య వాగ్వాదం తోపులాట జరిగింది. కాగా.. మామునూరులో కొత్త విమానాశ్రయం నిర్మాణానికి కీలక ముందడుగు పడిన సంగతి తెలిసిందే.. ఎయిర్‌పోర్ట్ అభివృద్ధిపై గత కొంతకాలంగా కొనసాగుతున్న కసరత్తులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మామునూరును విమానాశ్రయంగా అభివృద్ధి చేయాలని గతంలోనే ప్రతిపాదనలు పంపగా, తాజాగా కేంద్రం దీనికి అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో వరంగల్ ప్రాంతానికి ప్రయాణ సౌకర్యాలు మరింత పెరగనున్నాయి. విమాన ప్రయాణాల విస్తరణ, వ్యాపారం, పర్యాటకం అభివృద్ధికి మామునూరు ఎయిర్‌పోర్ట్ కీలకంగా మారనుంది. కేంద్రం అనుమతినిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని పనులను వేగంగా ప్రారంభించనున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న సస్పెండ్

(మొదటి తరువాయి)

మల్లన్నకు ఫిబ్రవరి 5న షోకాజ్ నోటీస్ జారీ చేశారు. 12వ తేదీలోపు వివరణ ఇవ్వాలని కోరినా.. మల్లన్న నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు మల్లన్నను సస్పెండ్ చేస్తున్నట్లు చిన్నారెడ్డి తెలిపారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదన్నారు. మల్లన్నను ఎన్నో సార్లు హెచ్చరించినా మార్పు రాలేదన్నారు. బీసీ కులగణన ప్రతులు చించడంపై ఏఐసీసీ సీరియస్ అయిందన్నారు. మల్లన్న చేసిన వాఖ్యలు చాల తప్పు అని ఆయన పేర్కొన్నారు.

**ఏఐసీసీ నిర్ణయం మేరకే తీన్మార్ మల్లన్న సస్పెండ్ :** టీ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సస్పెన్షన్‌పై టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. తీన్మార్ మల్లన్న విషయంలో ఏఐసీసీ నిర్ణయం తీసుకుందన్నారు. రాహుల్ గాంధీ ఆదేశాలతోనే తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా వ్యవహరించేవారికి ఇది ఒక హెచ్చరిక అని ఆయన తెలిపారు. భవిష్యత్‌లో ఎవరైనా పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవని మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఆ పార్టీ వేటు వేసిన సంగతి తెలిసిందే. తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణా కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 5న తీన్మార్ మల్లన్నకు కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ వ్యతిరేక చర్యలపై మల్లన్నను కమిటీ వివరణ కోరింది. ఫిబ్రవరి 12వ తేదీలోపు వివరణ ఇవ్వాలని మల్లన్నకు కమిటీ గడువు ఇచ్చింది. వివరణ ఇవ్వకపోవడంతో తీన్మార్ మల్లన్నపై కాంగ్రెస్ పార్టీ వేటు వేసింది.

# టన్నెల్ దగ్గర కొనసాగుతున్న సహాయక చర్యలు

(మొదటి తరువాయి)

సంఘటనాస్థలికి చేరుకున్నారు. ఇదిలా ఉంటే టెన్నల్ దగ్గర ఇప్పటికే మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు చేరుకున్నారు. మృతదేహాలను గుర్తించి అధికారులు బంధువులకు అప్పగించనున్నారు. మరోవైపు ప్రమాద స్థలం వరకు లోకో ట్రాక్‌ను జైపీ కంపెనీ సిద్ధం చేస్తోంది. ప్రమాదం జరిగిన స్థలంలో 200 మీటర్ల పొడవు, 9.2 మీటర్ల ఎత్తులో బురద, మట్టి, రాళ్లు ఉన్నాయి. ఇక్కడే టీబీఎం సగ భాగం కూరుకుపోయింది. మట్టిని బయటకు తరలించేందుకు మ్యానువల్‌గా సాధ్యం కాకపోవడంతో లోకోను అక్కడి వరకు తెచ్చే ప్రయత్నం చేస్తు?న్నారు. కన్వేయర్ బెల్టు కూడా అందుబాటులోకి వచ్చింది. 12వ కిలోమీటర్ నుంచి 13.5 కిలోమీటర్ల వరకు పేరుకుపోయిన మీటరున్నర మట్టిని రెస్క్యూ టీమ్స్ ఎత్తి పోస్తున్నాయి. లోకోను 13.5 కిలోమీటరు వరకు తీసుకొచ్చి మట్టిని బయటకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. కొన్నిరోజుల క్రితం ఈ టన్నెల్లో నిర్మాణ పనులు జరుగుతుండగా అనుకోని ప్రమాదం చోటుచేసుకుంది. 8 మంది లోపల చిక్కుకుపోయారు. ఈ సంఘటన ఎనిమిదో రోజుకు చేరుకుంది. కానీ ఇంకా పూర్తి స్థాయిలో రెస్క్యూ పూర్తవ్వలేదు. పనులు పూర్తి చేసేందుకు రెస్క్యూ బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. ప్రస్తుతం మట్టి తొలగింపు పక్రియ తుదిదశకు చేరుకుంది.

## మణిపూర్‌లో దారికొస్తున్న పరిస్థితులు

(మొదటి తరువాయి)

సమీక్ష నిర్వహించి..కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా మార్చి 8నుంచి రాష్ట్రంలోని అన్ని మార్గాల్లో ప్రజల రాకపోకలు స్వేచ్ఛాయుతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అడ్డంకులు సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. హింసతో రగిలిపోతున్న ఈశాన్య రాష్ట్రంలో సాధారణ స్థితిని పునరుద్ధరించడంపై అమిత్ షా అధికారులతో చర్చలు జరిపినట్లు సమాచారం. దిల్లీలో నిర్వహించిన ఈ సమావేశంలో మణిపుర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆర్మీ, పారామిలటరీ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత అక్కడి పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి. దాదాపు రెండేళ్లుగా జాతుల మధ్య వైరంతో రగులుతున్న మణిపుర్‌లో కల్లోల పరిస్థితుల నేపథ్యంలో ఇటీవల సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన కేంద్ర ప్రభుత్వం అధికారాలన్నింటినీ అక్కడి గవర్నర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తమ వద్ద ఉన్న అక్రమ ఆయుధాలు, పేలుడు పదార్థాలను ఏడు రోజుల్లోగా అప్పగించాలని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు గవర్నర్ అజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఏడు రోజులలో దాదాపు 300 ఆయుధాలను ప్రజలు ప్రభుత్వానికి అప్పగించినట్లు సమాచారం.

# రేంవత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

(మొదటి తరువాయి)



కిషన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత వారం రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి బీజేపీపై.. వ్యక్తిగతంగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవాలకు విరుద్ధంగా బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారు.. అవగాహన, అనుభవ రాహిత్యంతో, అసహంతో మాట్లాడుతు న్నారని ఆరోపించారు. తాను కేంద్ర మంత్రిగా చేసిన పనులు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియ చేస్తున్నానని.. కేంద్ర పథకాల్ని తెలంగాణలో అమలు చేస్తున్నామని తెలిపారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రాలకు కేంద్రం నిధులు ఇవ్వడంలో ఒక విధానం ఉంటుంది. తెలంగాణలో కేంద్రం చేపట్టిన రూ.10లక్షల కోట్ల విలువైన పనులను ఇప్పటికే వివరించాం. నేను ఇతర కేంద్ర మంత్రులను బెదిరించానని దిగజారుడు మాటలు మాట్లాడారు. కేంద్ర పథకాలను సమర్థంగా అమలు చేయాలని సీఎంలకు ఎన్నో లేఖలు రాశాను. సీఎంలతో సంబంధం లేకుండా రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే వ్యక్తిని. దేశంలో నిర్మించే 7 టెక్స్‌టైల్ పార్కుల్లో ఒకటి తెలంగాణకు తెచ్చాను. రాష్ట్రానికి ఆర్‌ఆర్‌ఆర్‌ను కేంద్రం మంజూరు చేసింది. ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది. వాటిని పక్కన పెట్టి భాజపాపై ఆరోపణలు చేస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం లేక పోవడంతో కొన్ని అమలు చేయలేక పోయామని పేర్కొన్నారు. 14 నెలల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక తన మీద దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, ఆయన పైన అసంతృప్తి.. ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తుందని కిషన్ రెడ్డి తెలిపారు. బీజేపీని బ్లాక్ మెయిల్ చేసినంత మాత్రాన రేవంత్ రెడ్డి మీద వ్యతిరేకత పోదని కిషన్ రెడ్డి ఆరోపించారు. రేవంత్ రెడ్డి మాట తెలంగాణ ప్రజకు నమ్మే పరిస్థితి లేదు.. తాను అంకిత భావంతో పని చేస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారం కోసం కేసీఆర్‌కు 40 ఉత్తరాలు రాశానని.. రేవంత్ రెడ్డికి కూడా ఉత్తరాలు రాశానని అన్నారు. తెలంగాణ రేవంత్ రెడ్డి సొంత జాగీరా.. రేవంత్ రెడ్డి మీద కోపంతో తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటామా.. అని అన్నారు. విలువలకు కట్టుబడి పని చేస్తానని.. చిన్నప్పటి నుండి సిద్ధాంతం కోసం పని చేశా.. నీ తాటాకు చప్పుళ్ళకు భయపడనని రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సూచించారు. ఇచ్చిన హామీలు అమలు చేయక తమ మీద దాడి చేస్తున్నారని మండిపడ్డారు.

# అజేయ శక్తిగా ఎదుగుతున్న భారత్

(మొదటి తరువాయి)

నైపుణ్యాన్ని చాటుకుందని, రోజుకో రికార్డును భారతదేశం సృష్టిస్తోందని చెప్పారు. భారతదేశ నిర్వహణా నైపుణ్యం, ఆవిష్కరణల సామర్థ్యాన్ని ప్రపంచం మొత్తం ఆసక్తిగా గమనిస్తోందని అన్నారు. దేశ రాజధానిలో శనివారంనాడు నిర్వహించిన ఎన్‌ఎక్స్‌టీ కాంక్లేవ్ 2025 లో ప్రధానమంత్రి మాట్లాడుతూ, భారత్ గురించి ప్రతిరోజూ సానుకూల సమాచారం వస్తుండటంతో ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తూ, భారత్‌కు రావాలని తహతహలాడుతున్నాయని చెప్పారు. ఫిబ్రవరి 26వ తేదీతో ప్రయాగ్‌రాజ్‌లో ముగిసిన మహాకుంభ్-2025 గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఒక టెంపరరీ సిటీలో నదీతీరాల వెంబడి కోట్లాది మంది ప్రజలు పవిత్రస్నానాలు చేయడంపై యావత్ ప్రపంచం ఆశ్చర్యంతో చూసిందని,మహాకుంభ మేళా నిర్వహణ భారతదేశం పాటించే నిర్వహణా నైపుణ్యాలు, ఆవిష్కరణలను ప్రపంచానికి చాటిచెప్పిందని అన్నారు. భారతదేశం గ్లోబల్ శక్తిగా ఎదుగుతున్న వైనాన్ని మోదీ వివరిస్తూ, ఏఐ సదస్సులో భారతదేశం కో-హోస్ట్‌గా వ్యవహరించిందని, భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో భారత్ కీలక భూమిక పోషించనుందని చెప్పారు. తదుపరి ఏఐ సమ్మిట్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుందని చెప్పారు. ఏఐ, గ్లోబల్ ఎకనామిక్ సమ్మిట్ల ద్వారా టెక్నాలజీ, ఇన్నొవేషన్, గ్లోబల్ డిఎ÷-లొమసీలో ఎదుగుతున్న శక్తిగా భారత్ కీలక పాత్ర పోషించనుందని స్పష్టం చేశారు. ÷ారతదేశం సెమికండక్టర్లు, విమాన వాహక నౌకల తయారీ వంటి వాటితో వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఆటోమొబైల్ ఉత్పత్తిదారుగా కూడా మరిందని వివరించారు. భారత దేశం పాటించే యోగా, ధ్యానం వంటివి విదేశీయులు ఆచరిస్తున్నారని, మన సూపర్‌ఫుడ్ మఖానా, మి÷-లలెట్, ఆయుష్ ఉత్పత్తులు విరివిగా వాడుతున్నారని మోదీ చెప్పారు.

# మల్టీప్లెక్స్‌లకు ఊరట

(మొదటి తరువాయి)

వాయిదా వేసింది. కాగా.. జనవరి 21న 16 ఏళ్ల లోపు పిల్లలు మల్టీప్లెక్స్ థియేటర్‌కు వెళ్లే విషయంపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. సమయాబావం లేకపోవడంతో పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారించిన హైకోర్టు పలు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు 16 సంవత్సరాల లోపు చిన్నారులు వెళ్లకూడదు అని ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించాలని హైకోర్టు ధర్మాసనం కోరింది. అయితే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై మల్టీప్లెక్స్ యాజమాన్యం పోరాడుతోంది. బెనిఫిట్ షో, స్పెషల్ షోలకు అనుమతులు ఇవ్వకపోయినప్పటికీ తాజాగా 16 ఏళ్లలోపు చిన్నారులను అనుమతించే విషయంలో ఉత్తర్వులను హైకోర్టు సవరణ చేసింది. 16 ఏళ్ల చిన్నారులు థియేటర్‌లోకి వెళ్లే విషయంలో నిబంధనలు విధిస్తే.. సినిమా వసూళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఫ్యామిలీ ఆడియన్స్ సినిమాకు వెళ్లే సమయంలో కుటుంబం మొత్తం వెళ్తుంటారు. ఈ క్రమంలో నిబంధనలు ఉంటే ఫ్యామిలీ వెళ్లే అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో ఇతర వర్గాల అభిప్రాయాల సే కరించి కోర్టుకు సమర్పించడంతో న్యాయస్థానం జనవరి 21న ఇచ్చిన ఉత్తర్వులను సవరించింది. అలాగే స్పెషల్ షోలు, బెనిఫిట్ షోలకు ఎట్టిపరిస్థితిల్లో పర్మిషన్ ఇవ్వబోమని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే తేల్చిచెప్పిన విషయం తెలిసిందే. ఇదే అంశాన్ని కూడా హైకోర్టు ప్రస్తావిస్తూ తదుపరి విచారణను ఈనెల 17కు వాయిదా వేసింది.

# త్వరలో ఉపఎన్నికలు తప్పవు



(మొదటి తరువాయి)

కారుతాయని అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పలువురు కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కార్తీక్ రెడ్డి అసెంబ్లీకి ఎమ్మెల్యేగా వస్తారని తెలిపారు. కేసీఆర్ దళం గులాబీ వనంలోకి వస్తున్న అందరికీ స్వాగతం అని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన ఇంచార్జి మీనాక్షి తన బ్యాగ్ మోయొద్దు అని చెప్పింది.. నీ పక్కన కూర్చున్న రేవంత్ రెడ్డినే బ్యాగ్‌లు మోసి పైకి వచ్చాడని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎక్కడ చూసినా రేవంత్ రెడ్డిని బండ బూతులు తిడుతున్నారు.. రైతు బంధు ఎవరికీ పడడం లేదు అని తిడుతున్నారని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు టింగ్ టింగ్ మని పడేవి అని చెబుతున్నారు.. అందుకే రేవంత్ రెడ్డికి టింగ్ టింగ్ అనే పదం పడదని విమర్శించారు. అందుకే టకీ టకీ మని రైతు భరోసా పడుతుంది అంటున్నాడు.. ఎక్కడ చూసినా రైతు భరోసా పడట్లేదని కేటీఆర్ పేర్కొన్నారు. ఫాం హౌస్‌లు ఎవరికీ లేవు లోకం మీద.. నాకు ఒక్కడికే ఉన్నట్లు చెబుతున్నారు.. జెన్వాడలో ఉన్న తన కోసమే హైడ్రా ఏర్పాటు చేశారని కేటీఆర్ ఆరోపించారు. మరోవైపు.. ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని కేటీఆర్ మండిపడ్డారు. వేగంగా కమీషన్ల కోసం పనులు స్టార్ట్ చేశారు.. ఎస్‌ఎల్‌బీసీ వద్ద ఒక మంత్రి చేపలు తిందాం అంటాడు.. ఇంకో మంత్రి నీళ్లు వాటర్ కలవడం వల్ల జరిగింది అంటున్నాడు.. ఇలాంటి మంత్రులు ఉన్నారని దుయ్యబట్టారు. ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదానికి కారణం కేసీఆర్ అని అంటున్నారు.. అధికారం కోల్పోయి ఇన్ని నెలలు అయినా కేసీఆర్ అనే అంటున్నారని పేర్కొన్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికలు అయినా.. పార్లమెంట్ ఎన్నికలు అయినా గులాబీ జెండానే ఎగురుతుందని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ వాళ్లు వచ్చి మాయమాటలు చెబుతారు.. ఇంకోసారి అసలు మోసపోవద్దని కేటీఆర్ పేర్కొన్నారు.

## సంపాదకీయం

# అమెరికా సాయంపై దాగుడు మూతలు

అంతర్జాతీయ అభివృద్ధికి సహాయం అందించేందుకు సంబంధించిన తమ సంస్థ (యు.ఎస్.ఎయిడ్)ను మూసేయాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. దేశంలోని రెండు ప్రధాన పాలక పార్టీలైన బిజెపి, కాంగ్రెస్‌ల మధ్య ఇది ఒక ముష్టి యుద్ధానికి దారితీసింది. ఈ మూసివేత నిర్ణయంతో పాటు యు.ఎస్.ఎయిడ్ నిధుల గ్రహీతలుగా వున్న వారి జాబితా కూడా ప్రకటితమైంది. ఈ జాబితా ఆధారంగా భారతదేశంలో ఓటింగ్ శాతం పెంపుదల కోసం 2.1 కోట్ల డాలర్ల నిధులు అందినట్టు ట్రంప్ చెబుతున్నారు. ఆయన ఎవరో ఒకరిని ఎన్నికయ్యేలా చేసేందుకోసం ఈ నిధులు ఉద్దేశించాయంటూ ట్రంప్ ఈ వాదనను మరింత ముందుకు తీసుకువెళ్లారు. దీని కొనసాగింపుగా మరో ముఖాముఖిలో 'ఓటింగ్ శాతం పెంపుదల కోసం ఈ నిధి భారతదేశంలోని తన స్నేహితుడు మోడీకి చేరింద'ని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ప్రకటనలను తీవ్రంగా పరిశీలించవలసిన అవసరముంది. వీటిపై లోతుగా దర్యాప్తు చేయాలి. నిజమని తేలేట్టయితే గనక ఇది మన దేశ ప్రజాస్వామ్య ప్రక్రియలో విదేశీ శక్తుల ప్రత్యక్ష జోక్యం తప్ప మరొకటి కాబోదు. కనుక ఈ డబ్బు నిజంగా ఏ ప్రయోజనాల కోసం ఎవరికి చేరింది, తెలుసుకునే హక్కు మనకుంది.

**లోతైన కారణాలివే**

యు.ఎస్.ఎయిడ్ అనేది ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా అవసరమైన దేశాలకు, సమాజాలకు సహాయం అందజేసే అమాయకమైన సంస్థ ఏమీ కాదు. అమెరికా విదేశాంగ శాఖ వ్యవహారాల కొనసాగింపుగానే అది పనిచేస్తుంది. దాని దుందుడుకు విదేశాంగ విధాన ప్రయోజనాలను ముందుకు తీసుకుపోవడానికే పనిచేస్తుంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో నాటి సోవియట్ యూనియన్ ప్రభావాన్ని వెనక్కు కొట్టడానికే జాన్ ఎఫ్ కెనడీ యు.ఎస్.ఎయిడ్ నెలకొల్పారు. అప్పటి నుంచి ఆ యా దేశాలలో ప్రభుత్వాల మార్పులోనూ అమెరికా కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడి సోషలిస్టు ఉద్యమాలను అణచివేయడంలోనూ అది ముఖ్య పాత్ర వహించింది. ఇటీవల అంటే 2023లో కూడా మెక్సికో మాజీ అధ్యక్షుడు ఆంద్రూ మాన్యుయేల్ లోపెజ్ ఒబ్రడార్ తన దేశ అంతర్గత వ్యవహారాలలో అమెరికా జోక్యాన్ని ఖండించారు. తన ప్రభుత్వానికి వ్యతిరేకమై గ్రూపులకు యు.ఎస్.ఎయిడ్ నిధులు నిలిపేయాలని డిమాండ్ చేశారు. 2014లో యు.ఎస్.ఎయిడ్ క్యూబన్ ట్విటర్ వేదికగా జున్‌జునే అన్న ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసి సోషలిస్టు క్యూబాలో అశాంతి, అస్థిరత సృష్టించేందుకు ప్రయత్నించింది. అమెరికా ప్రయోజనలకు ముప్పుగా పరిగణించే ప్రభుత్వాలను మార్చివేయడానికి తామిచ్చే సహాయాన్ని సాధనంగా వాడటమనేది కొత్త లక్షణమేమీ కాదు. భారత దేశానికి ఈ విషయంలో మినహాయింపు కూడా లేదు. కేరళలో ఎన్నికైన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని తొలగించేందుకు కాంగ్రెస్ పార్టీ ఈ సహాయాన్ని ఎలా వినియోగించిందో సాక్ష్యాధారాలతో సహా బయటపడింది.

**కమ్యూనిస్టులపై రెండు సార్లు కుట్ర!**

1957–59 మధ్య అంటే కేరళలో ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్ నాయకత్వాన కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిన సమయంలో భారతదేశంలో పనిచేసిన అమెరికా మాజీ రాయబారి ఎల్స్‌వర్త్ బంకర్ ఒక ఇంటర్వ్యూలో ఆ విషయాన్ని కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పారు. "మేము కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక సహాయం చేశామన్నది వాస్తవం' అని ఆయన చెప్పారు. ఆ ప్రభుత్వాన్ని తర్వాత రద్దు చేసిన సంగతి కూడా తెలిసిందే. బంకర్ వాస్తవాలు బయటపెట్టిన సంచలన ఈ ఇంటర్వ్యూ పాఠం రికార్డులు కొలంబియా విశ్వవిద్యాలయం మౌఖిక చరిత్ర విభాగం ఆర్కైవ్స్‌లో అందుబాటులో వున్నాయి. అదే విధంగా 1973–75 మధ్య భారత దేశంలో పనిచేసిన అమెరికా రాయబారి డేనియల్ పాట్రిక్ మొయిన్‌హాన్ ఇలాంటి మరో ఒప్పుకోలు ప్రకటన చేశారు. ప్రమాదకర శాంతి (డేంజరస్ పీస్) అనే తన పుస్తకంలో మోయిన్‌హాన్ కమ్యూనిస్టుల పట్టును ఎదుర్కోవడం కోసం కాంగ్రెస్ పార్టీకి అమెరికా రెండు సందర్భాల్లో ఒకసారి కేరళలో మరోసారి పశ్చిమ బెంగాల్‌లో నిధులు సమకూర్చిందని వెల్లడించారు. భారత దేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో అమెరికా చాలా చురుకైన పాత్ర పోషించిందనీ, గట్టిగా జోక్యం చేసుకుందనీ అమెరికా రాయబారులు స్వయంగా ఒప్పుకున్న ఈ రెండు సందర్భాలు సుస్పష్టం చేస్తున్నాయి. ప్రజాస్వామికంగా ఎన్నికైన కమ్యూనిస్టు ప్రభుత్వాలను కూలదోసేందుకు ఆ విధంగా అమెరికా జోక్యం చేసుకుందని అర్థమవుతుంది.

**రెండు పార్టీలకూ ఆమోదమే!**

కనుక కాంగ్రెస్, బిజెపి (లేదా దాని పూర్వ రూపమైన జనసంఘ్)లకు విదేశీ జోక్యాన్ని ఆహ్వానించే విషయంలో ఎలాంటి అభ్యంతరం లేదనే వాస్తవాన్ని బట్టి చూస్తే దేశ సార్వభౌమత్వం పట్ల ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల వారి నిబద్ధత ఏపాటిదో లేక నిబద్ధతా లేమి ఎంతటిదో కళ్లకు కడుతుంది.

ఈ నేపథ్యంలో చూసినప్పుడు భారత దేశంలో ఓటింగు శాతం పెంపు కోసం 2.1 కోట్ల డాలర్ల చెల్లింపులు చేసినట్టు అమెరికా అధ్యక్షుడు వెల్లడించిన అంశం చాలా తీవ్రంగా తీసుకోవలసి వుంటుంది. దీన్ని విస్మరించడం లేదా తోసిపారేయడం కుదిరేది కాదు. అసలు అది దేనిగురించోనన్నట్లు మాట్లాడుతూ బిజెపి లేదా కాంగ్రెస్‌లు దాన్ని కప్పిపుచ్చడం జరగనివ్వకూడదు. ట్రంప్ ప్రభుత్వ వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయనీ ప్రభుత్వం దానిపై పరిశీలన జరుపుతున్నదనీ విదేశాంగ మంత్రి ప్రకటించారు. అంతకు మించి అసలు ఈ చెబుతున్న వాటిలో ఏమైనా నిజముందా లేదా అనేదానిపై మంత్రి పూర్తి మౌనమే వహించారు. కొన్ని మీడియా సంస్థలైతే ఈ నిధులు ఇండియా కోసం కాదనీ బంగ్లాదేశ్ కోసం ఉద్దేశించినవనీ వార్తలు ఇచ్చాయి. ట్రంప్ ఢాకాను ఢిల్లీ అని పొరబడి వుండొచ్చని చెప్పాయి. ఈ రకమైన వివరణ ఆశ్చర్యకరంగా వుండొచ్చు. ఏమైనా భారత దేశ వ్యవహారాల్లో యు.ఎస్.ఎయిడ్ జోక్యందారీ కార్యకలాపాలేమిటన్న దానిపై స్పష్టమైన పారదర్శకమైన

# అశాస్త్రీయ విభజన....కేంద్రం చోద్యం !



ఉమ్మడి ఎపి విభజన వల్ల రెండు కుటుంబాలు బాగుపడ్డాయి. దాదాపు ఓ పదిహేను లక్షల కోట్ల అప్పులు రెండు రాష్ట్రాల నెత్తిన పడ్డాయి. బాగుపడ్డది మాత్రం కెసిఆర్ కుటుంబం, జగన్ కుటుంబం మాత్రమే. విభజన సమయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరించిన దుందుడుకు చర్యల కారణంగా అనేకానేక సమస్యలు ఏర్పడ్డాయి. పదేళ్లు దాటినా సమస్యలు కొలిక్కి రావడం లేదు. విభజన సమయంలో శాస్త్రీయత లోపించింది. ఆస్తులు, అప్పులు ఎలా పంచుకోవాలన్నదానిపైనా స్పష్టత లేకుండా చేశారు. తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండి అన్న చందాన విభజన చేసి వదిలి పెట్టారు. ఈ పదేళ్లలో పాలకులు ఇష్టం వచ్చినట్లుగా అప్పులు చేసినా, కేంద్రం దృష్టి పెట్టలేదు. పట్టించుకోలేదు. నిలదీయలేదు. అప్పులు చేసారని పెదవి విరిచారు. అనుమతించిన ఢిల్లీ పెద్దలే ఇప్పుడు చోద్యం చూస్తున్నారు. తరవాత అధికారంలోకి వచ్చిన మోడీ నేతృత్వంలోని బిజెపి కూడా చిత్తశుద్ధితో పనిచేయడం లేదు. సమస్యలు ముదురుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. విభజన చట్టం ప్రకారం.. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ నేతృత్వంలో.. ఒక స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేసి..దానికి కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు అని పేరు పెట్టి.. మార్గదర్శకాలు జారీచేసినా.. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా సాగదీస్తున్నారు. దీంతో.. ఏయేటికాయేడు కృష్ణానదీ జలాల పంపకం సంక్లిష్టంగానే మారుతూనే ఉంది. దశాబ్దం గడిచినా.. ముఖ్యమంత్రులు మారినా చిక్కుముళ్లు వీడింది లేదు. తెలుగు రాష్ట్రం రెండుగా విడిపోయిందే నీళ్లు నిధులు నియామకాల పంచాయితీ మీద. ఇందులో మొదటిది నీళ్లు. విభజన జరిగితే నీటి యుద్ధాలు ఖాయమని, మనతో మనమే కొట్లాడుకుంటామని అప్పట్లో వచ్చిన విమర్శలను విభజనవాదులు పట్టించు కోలేదు. సరికదా కేంద్రం చోద్యం చూస్తోంది. దీనికి గోదావరీ,కృష్ణా జలలాల వివాదమే నిదర్శనం. ఇరు రాష్ట్రాలకు ఆమోద యోగ్యంగా ఈ వివాదం పరిష్కరించడంలో కేంద్రజలశక్తి సంఘం పూర్తిగా విఫల మయ్యింది. పూతమందు లాగా అప్పటికప్పుడు ఏదో ఒక పరిష్కారం చూపి తప్పించు కుంటోంది. ఇది అన్ని రాష్ట్రాల విషయంలో అలాగే ఉంటుంది. స్పష్టమైన జలవిధానం అవలంబించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. ఇంకా చెప్పాలంటే జాతీయ జలవిధానం, నదుల అనుసంధానం అంశాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. రెండురాష్ట్రాల మీదుగా ప్రవహిస్తున్న కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్ల వాటాలు తేలక..పాలి పంచాయితీల్లాగా సాగుతున్నాయి. వివాదాల పరిష్కారం కోసం కెఆర్‌ఎంబీ, జీఆర్‌ఎంబీ పేర్లతో మేనేజ్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేసినా.. అవన్నీ ఉన్నా లేనట్టు.. ఉత్సవ విగ్రహాలుగానే మిగిలి పోతున్నాయి. ఎవరి రాష్ట్ర ప్రయోజనాలను వాళ్లు ఏకరూవు పెట్టుకుంటూ.. వాళ్ల వాళ్ల రాష్ట్రాల్లో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయి. దీంతో సమస్య సజీవంగా ఉంటూ వస్తోంది. ముఖ్యంగా తెలంగాణ గడ్డమీద నీటి కటకట తీవ్రస్థాయిలో ఉంది. ఆరున్నర లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేసుకున్నారు. సాగర్ ఎడమకాల్వకు ఇంకా నాలుగు తడులు కావాలి. హైదరాబాద్ సహా అనేక జిల్లాల్లో తాగునీటి అవసరాలు తీరనేలేదు. దీంతో సహజంగానే కృష్ణా నదీజలాల విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పుడే కాదు.. ఖరీఫ్, రబీ సీజన్లు మొదలయ్యే వేసవికాలం వస్తుందంటే చాలు ఏటా ఇవే ఒత్తిళ్లు ఉంటున్నాయి. కెఆర్‌ఎంబీ దగ్గర పంచాయతీలతో రెండు రాష్ట్రాల మధ్య అగాధం పెరుగు తూనే ఉంది.. కృష్ణా నదిలో నీళ్లు తక్కువ, దానిమీద కట్టిన ప్రాజెక్టులు ఎక్కువ. ఎగువన ఉన్న కర్నాటక అనేక ప్రాజెక్టులు కట్టడం వల్ల చుక్కనీరు రాని దుస్థితి ఉంది. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల్లో నిండిన తరవాత అధిక వర్షాలు వచ్చినప్పుడే దిగువకు నీరు విడుదల చచేస్తున్నారు. ఈ విషయంలో కర్నాటక జలదోపిడీ చేస్తున్నా కేంద్రం నిలదీయలేక పోతోంది. ఇకపోతే గోదావరి నదిలో నీళ్లు ఎక్కువ.. కట్టిన ప్రాజెక్టులు తక్కువ. పోలవరం చేపట్టినా అది పూర్తి కాలేదు. తెలంగాణలో కాళేశ్వరం కట్టినా..అది నీటిని నిల్వ చేసుకునే ప్రాజెక్ట్ కాదు. దీంతో గోదావరి నీటిని పుష్కలంగా వాడుకునే వీలున్నా ఏటా వేలాది టిఎంసిలు వృధాగా సముద్రం పాలవుతున్నాయి. వీటిని ఉపయోగించుకునేలా ప్రణాళికలు లేవు. ఉన్నా ప్రాజెక్టులకు డబ్బులు లేవు. డబ్బులన్నీ పెన్షన్లు, ఉచిత పథకాలకే సరిపోతున్నాయి. గోదావరి నీళ్ల మళ్లింపు కోసం ఇరు రాష్ట్రాలు ఉమ్మడి ప్రణాళికులు చేయలేకపోతున్నాయి. ఇక ఉన్న కృష్ణా జలాల విషయంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ కల్పించుకున్నా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ..ఏటా పంచాయితీలు తప్పడం లేదు. వేసవి ముంచుకొచ్చి సాగు–తాగు నీళ్ల అవసరాలు గుర్తుకొచ్చి నదీజలాల వాటాలపై రెండు తెలుగు ప్రభుత్వాలు తన్నులాడుకుంటున్నాయి. పట్టువిడుపుల ఊసే లేకుండా.. చెరోపక్క లాగుతూనే ఉన్నాయి రెండు ప్రభుత్వాలు. రాజకీయాలొద్దంటూనే రాజకీయాలు మాత్రమే చేస్తున్నాయి. పదేళ్లు దాటినా.. ప్రభుత్వాలు మారినా.. అదే లొల్లి.. ప్రతీ వేసవికీ ఈ పంచాయతీ తప్పడం లేదు. 66:34 నిష్పత్తితో 512–299 టీఎంసీల చొప్పున కృష్ణా నీళ్లను ఏపీ–తెలంగాణలు పంచు కోవాలి. ఇదీ విభజన తర్వాత జనాభా ప్రాతిపదికన 2015లో కుదిరిన ఒప్పందం.ఇటీవల నెలరోజుల వ్యవధిలో నాలుగుసార్లు సమావేశాలు ఏర్పాటు చేసి సంప్రదింపులు జరిపినా.. పంపకాల సమస్య కొలిక్కి రాలేదు. పైగా.. కొత్త సమస్యలు ఎదురవ్వడంతో మీరూ మీరూ కూర్చుని మాట్లాడుకోండి.. న్యాయబద్ధంగా వాటాలు పంచుకోండి అంటూ చేతులెత్తేసింది కెఆర్‌ఎంబి. నీటివాటాలే కాదు.. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల భద్రత.. ఏపీలో ఏర్పాటు కాబోయే కృష్ణాబోర్డు కార్యాలయం.. ఇలా వేటికవే ఎడతెగని సమస్యలుగా మారాయి. పదేళ్లపాటు కృష్ణా జలాల సమస్యలను పెద్దగా పట్టించుకోకుండా గాలికి వదిలేసిన ఆనాటి బిఆర్‌ఎస్ పాలకులు ఇప్పుడు విమర్శలతో ఆనందం చేసుకుంటున్నారు. కృష్ణానదిలో నీళ్ల వాడకం లెక్క పక్కాగా తేలాలంటే టెలిమెట్రీ పరికరాలు అమర్చాలన్న డిమాండ్లు కూడా వస్తున్నాయి. అయినా.. తమ వాదనలను కేఆర్‌ఎంబీ పెడచెవిన పెడుతోందని.. ఏపీకి వత్తాసు పలుకుతోందని, పైనుంచి కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని తెలంగాణ సర్కార్ ఆరోపిస్తోంది. ఈ విధంగా బీజేపీ కూడా ప్రేక్షకపాత్ర వహిస్తోంది.

# భాషాధిపత్యం

భాష అనేది ఆయా సమూహాల సాంస్కృతిక అభివ్యక్తి. ప్రజల సంస్కృతి, సంస్కారం వ్యక్తమయ్యేది వారి మాతృభాషలోనే. జనుల హృదయావిష్కరణ జరిగేది వారి భాషలోనే. వారి బాధ, దు:ఖం, వేదన, సంతోషం, ఆనందం, ప్రేమ, అన్నింటికీ మాతృభాషే వాహకం. అందుకే మాతృభాషల ప్రాధాన్యతను ఎవరూ కాదనలేరు. మనదేశం, వేలాది భిన్నభాషల, సంస్కృతుల సమ్మేళనం. భిన్నత్వంలో ఏకత్వం లాంటి ఈ జాతి జీవనాడిపై ప్రతిసారీ దాడి జరుగుతూనే ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్‌వాళ్లు మనల్ని ఆక్రమించాక మన సంస్కృతిలోకి భాష ద్వారా కూడా చొరపడే ప్రయత్నం చేశారు. మన విద్యావిధానానికి రూపకల్పన చేసిన మెకాలె, రక్తంలో భారతీ యులుగా, ఆలోచనలో ఆంగ్లేయులుగా ఉండేట్టు విద్యను తీర్చిదిద్దారు. వారి ఆలోచనలకు అనుకూలంగా సేవ కులుగా కొనసాగాము.ఆ తర్వాత ప్రపంచీకరణ పేరుతో వచ్చిన మార్కెట్ విస్తరణ, మన సాంస్కృతిక మూలాలపైనే కేంద్రీకరించాయి. ఆంగ్లభాషే జీవన భాషగా, జీవనోపాధిగా నిర్మించబడింది. ఏకరూప సంస్కృతిని తీసుకువచ్చే ప్రయత్నం జరిగింది. ఇప్పుడు మితవాద మతతత్వ శక్తులు సాంస్కృతిక వైవిధ్యతపై తీవ్రంగా దాడి ఎక్కుపెట్టారు. ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే ఎన్నిక, ఒకే పన్ను, ఒకే దేవుడు, ఒకే మతం, ఒకే నాయకుడు%ã%ఇలా ఒకే సంస్కృతిగా మార్చాలన్న ప్రయత్నంలో భాగంగానే నూతన విద్యావిధానాన్ని (2020) తీసుకువచ్చారు. గత కొన్ని సంవత్సరాల నుండి భాషాపరమైన ఆధిపత్యం కోసం పనిచేస్తున్నారు. అందులో భాగంగా హిందీ భాషను, ఇతర ప్రాంతీయ, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలపై రుద్దే చర్యలకు త్రిభాషా సూత్రం ఆధారంగా పాల్పడుతున్నారు. దీన్ని తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ మూడో భాషగా హిందీని అంగీ కరించబోమని, మరో భాషా యుద్ధానికి సిద్ధమని, బలవంతంగా హిందీని




రుద్దటాన్ని అనుమతించబోమని స్పష్టం చేశారు. అయితే నూతన విద్యావిధానంలో అనేక అంశాలూ అంగీకరించలేమని కూడా తేల్చి చెప్పారు. విద్య ఉమ్మడి జాబితాలోనిదని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ఇందుకు ప్రతిగా కేంద్రం, ఎన్.ఈ.పి.ని, త్రిభాషా సూత్రం అమలుచేయని యెడల సర్వశిక్షా అభియాన్ నిధులు విడుదల చేయ బోమని నిధులు నిలిపివేసింది. ఇది రాజ్యాంగ సమాఖ్య సూత్రాలకు విరుద్ధమని నిరసనలు మొదలయ్యాయి. తమిళనాడులోని బీజేపీ నేత, నటి రంజనా నాచియార్ ఈపాలసీని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మూడు భాషలను విద్యార్థులపై రుద్దడం చాలా తప్పనీ ఆమె తెలిపారు. హిందీ అధికారభాషే కానీ, జాతీయ భాష కాదని ఆమధ్య తమిళనటుడూ ఓ ప్రకటన చేశాడు. హిందీభాష గురించి, దాని అమలు గురించీ ఇంత వివాదం జరుగుతున్నా అసలు ప్రభుత్వ పాలన, ఇతర వ్యవహారాలన్నీ, రాష్ట్రాల్లో, కేంద్రంలో ఆంగ్లభాషలోనే సాగటం మనం చూస్తున్నాము. హిందీ ప్రాంతాల్లో హిందీ, ఆంగ్లభాషలే పాఠశాలల్లో బోధిస్తున్నారు. త్రిభాష సూత్రమేదీ అక్కడ పూర్తిగా అమలు కావడం లేదు. నేటి బోధనా ప్రమాణాలను పరిశీలిస్తే అన్ని భాషల నిబంధన ఏ భాషా సరిగా నేర్వలేని స్థితికి చేరింది. 2011 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూలు ప్రాంతాల్లో 22భాషలు ఉండగా వాటిలో 17భాషలు తిరోగమన బాట పట్టాయని, మాట్లాడే వారు తగ్గిపోతున్నారని, హిందీ, బెంగాలీ తర్వాత మూడవ స్థానంలో ఉన్న తెలుగు కూడా నాల్గవ స్థానానికి పడిపోయిందని పరిశోధకులు చెబుతున్నారు. మనదేశంలో సగటున రెండు నెలలకు ఒక భాష కను మరుగైపోతోందనీ గత యాభై ఏండ్లలో 283 భాషలు అదృశ్యమయ్యాయని వారు వివరిస్తున్నారు. ఉత్తర భారతంలో వందేండ్లలో 25 భాషలు కనుమరుగయ్యాయి. అందుకే తమిళనాడు ముఖ్యమంత్రి కూడా ఇదే వివరిస్తు న్నారు. హిందీని ఆధిపత్యంలోకి తీసుకువచ్చి, ఉత్తర భారతంలోని అనేక భాషలు–భోజ్‌పురి–మైథిలీ, అవధీ, బ్రజ్, బుందేలీ, గర్వాల్, కుమావోని, మాగాహి, మార్వారీ, మాల్వీ, ఛత్తీస్‌గఢీ, సంథాల, ముండారీ మొదలైన భాషల న్నింటినీ మింగేశారు. యూపీ, బీహార్ హిందీ 'హార్ట్‌ల్యాండ్స్' కాదు. వారి నిజమైన భాషలు అవశేషాలుగా మిగిలా యని, భాషా అస్తిత్వాన్ని గుర్తు చేస్తున్నారు. తమభాషను కోల్పోయిన జాతి సజీవ సంస్కృతినీ కోల్పోతుంది. భిన్నమైన సాంస్కృతిక వైవిధ్యాలను గుర్తించ నిరాకరిస్తూ భాషాధిపత్యాన్ని కొనసాగించాలనుకోవడం సరైనది కాదు. అందుకు ప్రతిఘటన కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. వైవిధ్యతలను వైరుధ్యాలుగా చేసి, వైశమ్యాలను పెంచే ప్రయత్నం వ్యతిరేకించాల్సిన అంశం. భాషలు ఎన్నయినా నేర్చుకోవచ్చు, వారివారి ఇష్టాలను బట్టి. ఒక భాషను ఇంకోభాషకు ప్రతిగా నిలపడం సరికాదు. భాషను కూడా మతతత్వానికి, ఆధిపత్యానికి ఉపయోగించుకుని మనుషుల మధ్య, ప్రాంతాల మధ్య విభజన తీసుకువచ్చి రాజకీయ ప్రయోజనాలను పొందాలనే ప్రయత్నాల్ని తిప్పికొట్టాల్సిందే. రాష్ట్రాల హక్కులను, సమాఖ్య విధానాలను గౌరవించి సమైక్యంగా ముందుకుపోవాలి.

## పరేడ్ గ్రౌండ్ లో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు ప్రారంభించే పథకాలు





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ ప్రజా స్వేచ్ఛ

-మహిళా సంఘాలచే ఆర్టీసీ అద్దె బస్సులు- మొదటి విడతలో 50 బస్సులకు పచ్చా జెండా ఊపి ప్రారంభించనున్న సీఎం

-మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు చెల్లింపు

-31 జిల్లాల్లో మహిళా సంఘాలచే పెట్రోల్ బంకుల ఏర్పాటు కోసం అయిల్ కంపెనీలో ఒప్పందాలు

-32 జిల్లాల్లో జిల్లాకు 2 మేగా వాట్ల చొప్పున 64 మేగా వాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లకు వర్చువల్ గా శంకు స్థాపన

-ఇందిరా మహిళా శక్తి- 2025 విడుదల

-14 వేల అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల నియామక నోటిఫికేషన్

## 14వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్.. డేట్ ఫిక్స్!



ప్రజా స్వేచ్ఛప్రజా స్వేచ్ఛ


తెలంగాణలో 14వేల అంగన్వాడీ టీచర్లు,హెల్పర్ల నియామకానికి నోటిఫికేషన్ని మహిళాదినోత్సవం రోజు ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మహిళాదినోత్సవం(ఈనెల 8) రోజు పలు పథకాలను సీఎం ప్రారంభించనున్నారు.మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను ప్రారంభించనున్నారు.అలాగే, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు.. మహిళా సంఘాలతో పెట్రోల్ బంకుల నిర్వహణకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## కమిషనర్ సీరియస్ వార్నింగ్..

- సివిల్ తగాదాలు, సెటిల్మెంట్లకు పాల్పడితే ఉపేక్షించం
- కానిస్టేబుల్ నుంచి ఏసీపీ వరకు అందరిపై నిఘా
- నెలలో ఏసీపీ, ఐదుగురు ఇన్స్పెక్టర్లపై క్రమశిక్షణ చర్యలు





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

హైదరాబాద్ సిటీప్రజా స్వేచ్ఛ

: పోలీస్ స్టేషన్లలో సివిల్ పంచాయతీలు చేసినా.. కాసుల కోసం కేసులను పక్కదారిపట్టించి సెటిల్మెంట్లకు పాల్పడినా సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటానని సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ హెచ్చరించినట్లు తెలిసింది. కమిషనరేట్లో పనిచేస్తున్న కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏసీపీల వరకు ప్రతి అధికారిపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ఇటీవల విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు ఎదుర్కోడమే కాకుండా మహిళా పోలీసులపట్ల అసభ్యంగా మాట్లాడిన బోరబండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ (ఎస్హెచ్వో, డీఐ)లపై బదిలీ వేటు వేశారు. ఒకరిని ట్రాఫిక్ విభాగానికి, మరొకరిని మరో పోలీస్ స్టేషన్ డీఐగా బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బండబూతుల స్టేషన్ శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు..

# న్యూ బార్ అసోసియేషన్ హాల్ ప్రారంభోత్సవం




ప్రజా స్వేచ్ఛ హైదరాబాద్

**వేదిక:** హయత్‌నగర్ కోర్టు కాంప్లెక్స్, హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా

**తేదీ:** శనివారం, 1 మార్చి 2025

**సమయం**: 11:00AM

న్యూ బార్ అసోసియేషన్ హాల్ ప్రారంభోత్సవం గౌరవనీయమైన ప్రముఖులచే అలంకరించబడిన ఒక ముఖ్యమైన సందర్భం, వీరితో సహా:

**గౌరవనీయులైన న్యాయమూర్తులు హాజరు:**

-గౌరవనీయులైన శ్రీ జస్టిస్ పి. సామ్ కోశి (న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు & అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, రంగారెడ్డి జిల్లా)

- గౌరవనీయులైన శ్రీ జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి (న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్రానికి హైకోర్టు)

-గౌరవనీయులైన శ్రీ జస్టిస్ నందికొండ నర్సింగ్ రావు (న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్రానికి హైకోర్టు)



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**ప్రత్యేక అతిథులు - బార్ అసోసియేషన్ ప్రతినిధులు:**

-చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ (ఆహ్వానించబడిన అతిథి & ఈవెంట్‌కు హాజరయ్యారు)

- శ్రీ S. శశిధర్ రెడ్డి (Prl. జిల్లా & సెషన్స్ జడ్జి, రంగా రెడ్డి జిల్లా)

- బొద్దు బిక్షపతి గౌడ్ (అధ్యక్షుడు, బార్ అసోసియేషన్, హయత్‌నగర్)

-ఎన్. సంతోష్ కుమార్ గౌడ్ (ప్రధాన కార్యదర్శి, బార్ అసోసియేషన్, హయత్‌నగర్)

- లీగల్ సెల్‌లోని ఇతర గౌరవనీయ సభ్యులు.

ఈ విశిష్ట అతిథులు మరియు న్యాయ నిపుణుల హాజరు ఈ సందర్భాన్ని నిజంగా ప్రత్యేకంగా చేసింది. ఈ గొప్ప విజయానికి హాజరైన మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

# ఇకపై ఆధార్ ప్రామాణీకరణ మరింత సులభం..






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**కొత్త వెబ్‌సైట్ ప్రారంభించిన కేంద్రం**

ప్రజా స్వేచ్ఛహైదరాబాద్

ఆధార్ ప్రామాణీకరణ అభ్యర్థనల ఆమోద ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధార్ గుడ్ గవర్నెన్స్ పోర్టల్‌ను ప్రారంభించింది. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థల ద్వారా ఆధార్ ప్రామాణీకరణ అభ్యర్థన కోసం ఆమోద ప్రక్రియను సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ పోర్టల్ పని చేస్తుంది. ఆధార్ (ఆర్థిక, ఇతర సబ్సిడీలు, ప్రయోజనాలు, సేవల లక్ష్య డెలివరీ) చట్టం, 2016 ప్రకరారం ఈ పోర్టల్ వినియోగదారులకు చాలా ప్రయోజనం చేకూరుస్తుంది. ఆరోగ్య సంరక్షణ విషయంలో వేగవంతమైన రోగి ధ్రువీకరణ, అలాగే విద్యారంగంలో పరీక్షలు, ప్రవేశాల కోసం సజావుగా విద్యార్థి ప్రామాణీకరణ పొందవచ్చు. అలాగే ఈ-కామర్స్ అగ్రిగేటర్లు సురక్షిత లావాదేవీల కోసం సరళీకృత ఈ-కేవైసీ క్రెడిట్ రేటింగ్ ఆర్థిక సేవలు, రుణాలు, ఆర్థిక ఉత్పత్తుల కోసం సమర్థవంతమైన గుర్తింపు ధ్రువీకరణ పొందవచ్చు. అలాగే కార్యాలయ నిర్వహణ అంటే సిబ్బంది హాజరు, హెచ్ఆర్ ధ్రువీకరణ ఆధార్ గుడ్ గవర్నెన్స్ ఉపయోగపడుతుంది. ఆధార్ ప్రామాణీకరణ సేవల కోసం దరఖాస్తు చేసుకునే సంస్థలకు కొత్త ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ దశల వారీ మార్గదర్శిగా పనిచేస్తుంది.

**పోర్టల్‌లో నమోదు ఇలా..**

- ముందుగా అధికారిక పోర్టల్‌ను సందర్శించి, అందులో ఒక సంస్థగా నమోదు చేసుకోవాలి.
- ప్రభుత్వ విభాగాలు, ప్రైవేట్ కంపెనీలు, సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చు.
- అనంతరం దరఖాస్తును సమర్పించి, ఆధార్ ప్రామాణీకరణ ఎందుకు అవసరమో వివరాలను అందించాలి.
- సిస్టమ్ నియంత్రణ మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులను ప్రాసెస్ చేస్తుంది.
- అనంతరం ప్రామాణీకరణ సేవలను ఏకీకృతం చేసి సంస్థలు వారి యాప్‌లు, సిస్టమ్‌లలో ఆధార్ ప్రామాణీకరణను ఏకీకృతం చేయవచ్చు.

ఈ పోర్టల్ లాంచ్‌పై ఎంఈఐటీవై కార్యదర్శి ఎస్ కృష్ణన్ మాట్లాడుతూ ఈ ప్లాట్‌ఫామ్‌తో వేగవంతమైన సుపరిపాలన అందుతుందన్నారు. అలాగే యూఐడీఏఐ సీఈఓ భువనేష్ కుమార్ మాట్లాడుతూ ఆధార్ గుడ్ గవర్నెన్స్ పోర్టల్ ప్రామాణీకరణ అభ్యర్థనల సమర్పణ, ఆమోదాన్ని సులభతరం చేస్తుందని పేర్కొన్నారు. ఈ పోర్టల్ త్వరలో అందరికీ అందుబాటులోకి వస్తుంది. అలాగే ఇది ప్రైవేట్ సంస్థలు ఆధార్ ప్రామాణీకరణను కస్టమర్-ఫేసింగ్ యాప్‌లలో ఏకీకృతం చేయడానికి అనుమతిస్తుందని వివరించారు.

# కాశింనగర్ ఎత్తిపోతల పథకం మంజూరు

**డాక్టర్.జి.చిన్నారెడ్డి ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్**

ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 01 వనపర్తి ప్రతినిధి

వనపర్తి నియోజకవర్గం లోని 6 గ్రామాలు,13,గిరిజన తాండాలలో 4 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది అని ప్రణాళిక సంఘము వైస్ చైర్మన్ డాక్టర్.జి.చిన్నారెడ్డి

అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి కి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి కి ధన్యవాదాలు.రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి.వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆరు గ్రామాలు, 13 గిరిజన తాండాల్లోని దాదాపు నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందించే,కాశీంనగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, ఈ మేరకు శనివారం ప్రభుత్వం మెమో నంబర్ 1712/ ప్రాజెక్ట్స్ - %××/ాా%2/ 2025, తేదీ 1-3-2025 ద్వారా జారీ చేసిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు.దీనితో ఆదివారం సర్వే పనులకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని చిన్నారెడ్డి అన్నారు.ఈ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద కాశిం నగర్,జయన్న తిరుమలాపురం, మున్ననూరు,అప్పాయిపల్లి, దత్తయిపల్లి,అంజనగిరి గ్రామాలతోపాటు మరో 13 గిరిజన తాండాలకు నాలుగు వేల ఎకరాలకు సాగు నీరు అందించే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు ఇచ్చిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు.

# పదవి విరమణ పొందిన కె.శేఖరా చారి ఎస్ఏ కి ఘన సన్మానం

**-ఘనంగా సన్మానించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు**



ప్రజాస్వేచ్ఛ ఫిబ్రవరి 01 పెద్దమందడి ప్రతినిది
వనపర్తి జిల్లా,పెద్దమందడి మండలం,వెలటూరు జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ లో ఇంగ్లీష్ టీచర్ కె.శేఖరా చారి స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) పదవి విరమణ చేయుచున్న సందర్భంగా స్థానిక పాఠశాల హెడ్మాస్టర్ ఆనంది విష్ణు అధ్యక్షతన వహించి, విద్యార్థులు,ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ ఇట్టి కార్యక్రమానికి డిసిఇబి చైర్మన్ చంద్రశేఖర్ జి హెచ్ ఎం. మోజర్ల, మద్దిగట్ల హెచ్ఎం. వర ప్రసాద్ రావు జిహెచ్ఎం హాజరు కావడం జరిగింది. సందర్భంగా జిహెచ్ఎం బాణం విష్ణు మాట్లాడుతూ,శనివారం జెడ్ పి పి హెచ్ ఎస్ లో,ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు కె.శేఖరా చారి పదవి విరమణ చేయుచున్న సందర్భంగా కుటుంబ సభ్యులతో,బంధుమిత్రులతో, శ్రేయోభిలాషులతో, కలిసిమెలిసి ఆనందంగా ఉండాలని, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలను పొందాలని అన్నారు.ఉపాధ్యాయ వృత్తిలో వివిధ ప్రాంతాల్లో, వివిధ హోదాల్లో, విధులు నిర్వహిస్తూ నేడు పదవి విరమణ చేస్తున్న సందర్భంగా, సన్మాన కార్యక్రమంలో ఘనంగా తోటి ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు ఘనంగా శాలువాలతో సత్కరించారు. విధి నిర్వహణలో ఎక్కడ విధులు నిర్వహించిన, విద్యార్థి, విద్యార్థులను తన తోటి తోబుట్టువులుగా భావించి, మంచి విద్యాబుద్ధులు నేర్పినటువంటి, ఈ రోజుతో ఉపాధ్యాయ శాఖనుండి తమ సర్వీస్ ముగించుకొని పదవి విరమణ పొందడం జరిగిందని చెప్పేటందుకు బాధగా ఉందని అన్నారు. ఒకపక్క ఉపాధ్యాయ వృత్తిని, ఇంకో పక్క కుటుంబాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ, నిబద్ధతతో పనిచేయడం గొప్ప విషయమని తెలియజేస్తూనందుకు చాలా గర్వంగా ఉందని అన్నారు. కె.శేఖరా చారి మాట్లాడుతూ, చదవంటే పుస్తకాలలో ఉన్న అక్షరాలు, మార్కులు ర్యాంకులు మాత్రమే కాదు. ప్రపంచతల్లి ఒడి మొదటి బడి అని పెద్దలంటారు. గురువులు విజ్ఞాన వ్యాప్తికి వారదలు. చదువుకోవాలని ఆశయం, ఆసక్తి గలవారికి పేదరికం అడ్డురాదని, అలా పేదరికంలో జన్మించిన వారు ఎందరో కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, ఒకరి దగ్గర ఉద్యోగం చేసే స్థాయి వరకు మన చదువు పరిమితం కాకూడదని, ఉద్యోగం ఇచ్చే స్థాయి వరకు ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. వెలటూర్ జెడ్పిహెచ్ఎస్ హై స్కూల్ లో, విధి నిర్వహణలో నాకు సహకరించిన నా తోటి ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో, బాణం విష్ణు జిహెచ్ఎం, ఉపాధ్యాయులు: వెంకటనారాయణ, రమేష్, శ్రీనివాసు, దేవేంద్రం, మునీరుద్దీన్ ,మల్లయ్య, రవికుమార్, గోపాల్, ప్రశాంతి మేడం, విద్యార్థిని,విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేడు వనపర్తికి రానున్న సీఎం రేవంత్ రెడ్డి

**-ఆర్.జగదీశ్వర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు**



ప్రజా స్వేచ్ఛ ఫిబ్రవరి 01 పెద్దమందడి ప్రతినిధి
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నేడు వనపర్తి జిల్లాకు,విచ్చేస్తున్న శుభ సందర్భంగా ప్రతి గడప నుండి, గ్రామ గ్రామాన,ప్రతి ఒక్కరు తరలిరావాల్సిందిగా, వెలటూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆర్.జగదీశ్వర్ రెడ్డి(బంగ్లా బాబు)ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నేడు అనగా ఆదివారం,వనపర్తి జిల్లాలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమి పూజలు చేయుచున్న రాష్ట్ర సీఎం ఏ.రేవంత్ రెడ్డి రాకతో వనపర్తి లో దాదాపు 100 కోట్ల రూపాయలకు సంబంధించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయుటకు విచ్చేస్తున్నారు కావున, ఎమ్మెల్యే మేగారెడ్డి ఉదయం లేచి రాత్రి వరకు ప్రజల కోసం పాటుపడి ప్రజల కోసం ఏదో చేయాలని తపనతో అనునిత్యం, నియోజకవర్గ ప్రజల కోసం కష్టసుఖాలు తెలుసుకొని, గ్రామ గ్రామాన తిరుగుతూ ఎక్కడ ఏ సమస్య ఉందో కనుక్కొని, ఆ సమస్య పరిష్కారం కోసం, పనులు వేగవంతం చేస్తాడు. ఈరోజు సీఎం రేవంత్ రెడ్డి వనపర్తి జిల్లాకు విచ్చేస్తున్న శుభ సందర్భంగా, ఎమ్మెల్యే మేగారెడ్డి ఇక్కడ సమస్యలు వివరించగా, సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి దాదాపు నూరుకోట్ల రూపాయలకు సంబంధించి అభివృద్ధి పరిరక్షణకు స్థాపన చేయుటకు విచ్చేస్తున్నారు. ఇది శుభ పరిణామం. ప్రతి గ్రామంలో, మండల వారీగా అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఇట్టి సభను విజయవంతం చేయాలని వెలటూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆర్.జగదీశ్వర్ రెడ్డి(బంగ్లా బాబు)ఒక ప్రకటనలో తెలిపారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఐజేయూ లక్ష్యం


**-టియూడబ్ల్యూ జే (ఐజేయు) సభ్యత్వ నమోదులో జిల్లా ఉపాధ్యక్షులు దూలం శ్రీనివాస్**


**-జర్నలిస్టులు విలువలతో కూడిన జర్నలిజం అందించాలని విజ్ఞప్తి**



ప్రజా స్వేచ్ఛ మార్చి 01 వలిగొండ ప్రతినిధి
జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే టి యూ డబ్ల్యూ జే (ఐజేయు)లక్ష్యమని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు దూలం శ్రీనివాస్ పేర్కొన్నారు శనివారం మండల కేంద్రంలోని స్థానిక యూనియన్ కార్యాలయంలో నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం టియూడబ్ల్యూజే (ఐజేయు) జర్నలిస్ట్ యూనియన్ మండల అధ్యక్షులు పడమటి దామోదర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండలస్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమం యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులతో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు హెల్త్ కార్డులు జర్నలిస్టు బీమా పథకం లాంటి సమస్యలపై ఐజేయు యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని ప్రతి ఒక్క జర్నలిస్టుకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని అన్నారు హెల్త్ కార్డులు రాష్ట్రంలోని అన్ని ప్రయివేటు కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు మండలంలోని జర్నలిస్టులకు స్థలం చూయించకుండానే పట్టాలు ఇచ్చారని పట్టాలు ఇచ్చిన జర్నలిస్టులకు స్థలం చూయించి ప్లాట్లు కేటాయించాలని సంబంధిత అధికారులను కోరారు అంతేకాకుండా అక్రిడిటేషన్ లేని జర్నలిస్టులకు కూడా వచ్చే విడతలో ప్లాట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు జర్నలిస్టులు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని కలువగా ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే జర్నలిస్టులకు ప్లాట్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో యూనియన్ కమిటీ సభ్యులు పలుసం మైసయ్య గౌడ్ బొడిగె మధు సత్యనారాయణ రెడ్డి పలుసం బాలరాజు పాలోజు రాజయ్య గోద అచ్చయ్య నాగెల్లి వలి గోలనుకొండ బాలరాజు రాగిరు మల్లేశం ఎం వెంకటేశం కె శ్రీశైలం బి సంతోష్ బి మధు డి గోపి పాల్గొన్నారు

# మంజీరా నదిలో నీట మునిగి ఇద్దరు యువకులు మృతి





ప్రజా స్వేచ్ఛ, మార్చి 01, మెదక్ జిల్లా ప్రతినిధి (రాము)
ఏడుపాయల మంజీరా నదిలో నీట మునిగి ఇద్దరు యువకులు మృతిచెందిన సంఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ ఇందిరా నగర్ కాలనీకి చెందిన కృష్ణ (20), శ్యాం కుమార్ (21) లు మూడు రోజుల క్రితం ఏడుపాయల జాతరకు తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు.తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఏడుపాయల ఆలయ సమీపంలోని చిన్న ఘనపూర్ మంజీరా నది రెండవ పాయ బ్రిడ్జి వద్ద స్నానానికి వెళ్లారు. మంజీరా నది రెండవ పాయలో నీటి మడుగులు మునిగిపోవడంతో కృష్ణ , శ్యాం కుమార్ ఇద్దరు నీట మునిగారు. వెంటనే మృతుల బంధువులు మత్స్య శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో గజ ఈత గాళ్ళ సహాయంతో నదిలో గాలించారు. నదిలో కృష్ణ, శ్యామల మృతదేహాలు వెలికి తీశారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొల్చారం ఎస్సై మహమ్మద్ గౌస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

# శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ- ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్ పో



ప్రజా స్వేచ్ఛ మార్చి 01 శేరిలింగంపల్లి
శేరిలింగంపల్లి మండల పరిధిలోనీ నల్లగండ్ల శ్రీ చైతన్య పాఠశాలలో ప్రముఖ శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ జన్మదినం సందర్భంగా సైన్స్ ఎక్స్ పో కార్యక్రమం నిర్వహించారు. డి ఆర్ డి ఓ శాస్త్రవేత్తలు మంగతాయారు, సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా విచ్చేశారు. విద్యార్థులు వినూత్నముగా 90 కు పైగా ప్రాజెక్టులను రూపొందించారు. వాటిలో వర్కింగ్ మోడల్ ఆఫ్ ఫోటో సింథసీస్, వర్కింగ్ మోడల్ ఆఫ్ ట్రెయిన్, ఏపీతీలియన్ టిష్యూస్, చంద్రయాన్ -3, కార్బన్ ప్యూరిఫికేషన్, డిస్టిలేషన్, డునాట్ టచ్ థిస్ కెమికల్ (మాంగనీస్ హెప్టాక్సైడ్ ), హైడ్రాలిక్ పాస్ యూజింగ్ పాస్కల్స్ లా, సోలార్ కార్ వంటి ప్రాజెక్టులతో పాటు ప్రైమరీ విద్యార్థులు రూపొందించిన హైడ్రో ఎలక్ట్రిసిటీ, డ్రిప్ ఇరిగేషన్, సర్క్యులేటరీ సిస్టమ్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, రీప్రొడక్షన్ ఇన్ ఏనిమల్స్, వాటర్ ప్యూరిఫికేషన్, వంటి ప్రాజెక్టులు చూపరులను ఆకట్టుకున్నాయి. అయోధ్య రామాలయం వంటి మోడల్స్, భారతీయ సంస్కృతిని, చరిత్రను తెలిపుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యఅతిథి సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీసిలా మేధోశక్తిని పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, అందుకు శ్రీ చైతన్య విద్యాసంస్థలను అభినందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చేసే ప్రాజెక్టును పరిశీలించి వారి ప్రతిభకు ముగ్ధుడిని అయ్యానని విద్యార్థులను కొనియాడారు. మీ తెలివి తేటలు దేశాభివృద్ధికి దోహదపడాలని హితవు పలికారు. పాఠశాల ప్రిన్సిపల్ యు. వాణి మాట్లాడుతూ చదువు, ఆటలతో పాటు విద్యార్థుల నైపుణ్యమును, సృజనాత్మకతను వెలికి తీసి వారి సర్వతోముఖాభివృద్ధిలో తాము భాగస్వాములం అయినందుకు గర్వకారణంగా ఉందని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలలో విద్యార్థులందరూ పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమానికి కృషిచేసిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో చివరగా ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణిలో నిలిచిన ప్రాజెక్టులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ నాగరాజు, ఇన్చార్జెస్ శ్రీలక్ష్మి, యం. కె. రంగ, ప్రైమరీ ఇన్చార్జ్ అమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ తెలంగాణ శ్రీ చైతన్య స్కూల్లో ఘనంగా సైన్స్ ఫెయిర్ కార్యక్రమం





ప్రజా స్వేచ్ఛ మార్చి 1 మేడిపల్లి ప్రతినిధి
బోడుప్పల్ శ్రీ చైతన్య స్కూల్లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన డాక్టర్ కిరణ్ కుమార్ శ్రీ లక్ష్మీ హాస్పిటల్, బోడుప్పల్ మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ తో విద్యార్థు లో సృజనాత్మక పెంపొందుతుందని విద్యతోపాటు విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక అంశాల్లో లోని నైపుణ్యాలను వారి ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు మరియు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏజీఎం ఖాసిం అలీ ,కోఆర్డి రమేష్ ప్రిన్సిపల్ రాజేందర్ అకాడమిక్ డీన్ దీపక్ సి బ్యాచ్ ఇంచార్జ్ నరేష్ ప్రైమరీ ఇంచార్జ్ అనిత మాట్లాడుతూ ముఖ్యంగా పాఠశాల దశ నుంచి సైన్స్ గణితం సబ్జెక్టులో పట్టు సాధించే విధంగా విద్యార్థులను తయారు చేయడంలో ఈ ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయన్నారు దేశానికి శాస్త్ర సాంకేతిక వైజ్ఞానాన్ని అందించిన ఎంతోమంది ఉన్నారని అందులో ఆర్యభట్ట మొదలుకొని అబ్దుల్ కలాం వరకు ఎంతోమంది వారి స్ఫూర్తిగా ఆ దిశలో కృషి చేశారని వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందుకు కొనసాగాలని వారు ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు కూడా విద్యార్థులను అభినందించారు

# తీన్మార్ మల్లన్న సస్పెండ్ ను ఖండిస్తున్నాం

**-కోట్ల వాసుదేవ్ బిసి రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు**

**-మల్లన్న సస్పెన్ష్ తో రాష్ట్రంలో కాంగ్రెస్ ఖతం**

**-ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,బీసీలంతా తీన్మార్ మల్లన్నకు అండగా నిలవాలి**



ప్రజా స్వేచ్ఛ మార్చి 01 గ్రేటర్ హైదరాబాద్
ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయడాన్ని బిసి రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు కోట్ల వాసుదేవ్ ఖండించారు.కోట్ల వాసుదేవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఉన్న రెడ్డిలు బీసీ నాయకులను చులకన భావంతో కుట్రలు చేస్తూ వారిని ఎదగనీయకుండా చేస్తున్నారని విమర్శించారు.గతంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసి,విమర్శించిన కోమటిరెడ్డి బ్రదర్స్ కు ఒక న్యాయం...బీసీ నాయకులైన తీన్మార్ మల్లన్న కి మరొక న్యాయమా...? అని మండిపడ్డారు.మల్లన్నను సస్పెండ్ చేయడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఖతం అవుతుందని,ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎస్సీ, ఎస్టీ,బీసీ నాయకులు కళ్ళు తెరిచి తీన్మార్ మల్లన్న మార్గంలో పయనించి ఆయనకు అండగా నిలవాలని,రాజ్యాధికారం సాధించడానికి కృషి చేయాలని అన్నారు.

# బిజినెస్

## ఆర్థిక పునర్జీవనానికి సంకేతం.. 9 శాతం పెరిగిన ఫిబ్రవరి జీఎస్టీ వసూళ్లు..!




ఆర్థిక వృద్ధిరేటు పునరుద్ధరణకు సంకేతంగా దేశీయ వినియోగం పెరగడంతో గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఫిబ్రవరి నెల జీఎస్టీ వసూళ్లలో 9.1 శాతం వృద్ధిరేటు నమోదై రూ.1.84 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం జీఎస్టీ వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ రూ.35,204 కోట్లు అని శనివారం కేంద్ర ఆర్థికశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) రూ.43,704 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ) రూ. 90,870 కోట్లు ఉంటుంది. సెస్ రూపంలో రూ.13,868 కోట్లు వసూలైంది. దేశీయ లావాదేవీల ద్వారా జీఎస్టీ ఆదాయం 10.2 శాతం వృద్ధి చెంది రూ.1.42 లక్షల కోట్లకు చేరుకోగా, విదేశాల నుంచి దిగుమతులు 5.4శాతం పుంజుకుని రూ.41,702 కోట్లుగా నిలిచాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే గత నెలలో జీఎస్టీ రీఫండ్స్ 17.3శాతం వృద్ధితో రూ.20,889 కోట్లకు చేరాయి. ఫిబ్రవరిలో నికర జీఎస్టీ వసూళ్లు 8.1 శాతం పెరిగి సుమారు రూ. 1.63 లక్షల కోట్ల వద్ద స్థిర పడ్డాయి. గతేడాది (2024) ఫిబ్రవరి స్థూల జీఎస్టీ వసూళ్లు రూ. 1.68 లక్షల కోట్లు, నికర జీఎస్టీ వసూళ్లు రూ. 1.50 లక్షల కోట్లుగా రికార్డయ్యాయి. గత నెలలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1.84 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అయినా 2025 జనవరిలో వసూలైన జీఎస్టీ ఆదాయం రూ.1.96 లక్షల కోట్లతో పోలిస్తే గత నెల జీఎస్టీ వసూళ్లు తక్కువే. అంతర్జాతీయ ఆర్థిక సవాళ్లను తట్టుకుని జీఎస్టీ వసూళ్లు పెరగడం దేశీయ ఆర్థిక వృద్ధి పురోభివృద్ధికి సంకేతం అని భావిస్తున్నారు. విదేశాల నుంచి దిగుమతిపై వచ్చే ఐ-జీఎస్టీతో పోలిస్తే, దేశీయ లావాదేవీలతో వస్తున్న జీఎస్టీ ఆదాయం నికరంగా పెరుగుతున్నది.

# తగ్గిన బంగారం, వెండి ధరలు..
# తెలుగు రాష్ట్రాల్లో లేటెస్ట్ రేట్లు ఇదిగో..

బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి.. గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో పెరుగుతుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి మార్కెట్‌లో బంగారం, వెండికి ఎల్లప్పుడూ డిమాండే ఉంటుంది. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిస్థితుల ప్రకారం.. ధరల్లో ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి.. అయితే.. తాజాగా గోల్డ్, సిల్వర్ ధర స్వల్పంగా తగ్గింది. శనివారం (1 మార్చి 2025) ఉదయం ఆరు గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.79,590, 24 క్యారెట్ల పదిగ్రాముల గోల్డ్ ధర రూ.86,830 గా ఉంది. వెండి కిలో ధర రూ.96,900 గా ఉంది. 10గ్రాముల బంగారంపై రూ.10, వెండి కిలోపై రూ.100 మేర ధర తగ్గింది.

**దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఒకసారి చూడండి..**



**బంగారం ధరలు..**

హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.79,590, 24 క్యారెట్ల ధర రూ.86,830 గా ఉంది.

విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.79,590, 24 క్యారెట్ల ధర రూ.86,830 గా ఉంది

ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.79,740, 24 క్యారెట్ల ధర రూ.86,980 గా ఉంది.

ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.79,590, 24 క్యారెట్ల ధర రూ.86,830 గా ఉంది.

చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.79,590, 24 క్యారెట్ల రేటు రూ.86,830 గా ఉంది.

బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.79,590, 24 క్యారెట్ల ధర రూ.86,830 గా ఉంది.

**వెండి ధరలు..**

హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,04,900

విజయవాడ, విశాఖపట్నంలో రూ.1,04,900

ఢిల్లీలో వెండి కిలో ధర రూ.96,900 లుగా ఉంది.

ముంబైలో రూ.96,900 గా ఉంది.

బెంగళూరులో రూ.96,900లుగా ఉంది.

చెన్నైలో రూ.1,04,900 లుగా ఉంది.

# బిగ్ బాస్కెట్ బిగ్ టార్గెట్..

### త్వరలో ఐపీఓకు, ఫుడ్ డెలివరీ విభాగంలోకి ఎంట్రీ..

టాటా సన్స్ ఆధ్వర్యంలో నడుస్తున్న క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బిగ్ బాస్కెట్ నిత్యావసర వస్తువుల నుంచి యాపిల్ ఐఫోన్ల వరకు అనేక వస్తువులను నిమిషాల్లోనే డెలివరీ చేస్తూ వినియోగదారులకు నమ్మకమైన సర్వీసులను అందిస్తోంది. రాబోయే రోజుల్లో బిగ్ బాస్కెట్‌ను మరింతగా విస్తరించాలని సంస్థ యాజమాన్యం భావిస్తోంది. క్విక్ ఫుడ్ డెలివరీ విభాగంలోకి కూడా ఎంట్రీ ఇవ్వాలనుకుంటున్నట్టు కంపెనీ సీఈఓ హరిమీనన్ తెలిపారు. అలాగే రాబోయే రెండేళ్లలో ఐపీఓకు రావాలని యోచిస్తున్నట్టు వెల్లడించారు తాజాగా ముంబైలో జరిగిన రిటైల్ సమ్మిట్‌లో హరి మీనన్ పాల్గొన్నారు. ఈ




కార్యక్రమంలో ఆయన కంపెనీ లక్ష్యాలను గురించి వివరించారు. 2026 మార్చి నాటికి అంటే మరో ఏడాదిలో బిగ్ బాస్కెట్ వ్యాపారాన్ని రెట్టింపు చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసినట్టుగా ఆయన తెలిపారు. ప్రస్తుతం బిగ్‌బాస్కెట్ దేశవ్యాప్తంగా 35 నగరాల్లో సేవలందిస్తోంది. వచ్చే ఏడాదికి 70 నగరాల్లో బిగ్‌బాస్కెట్ తన సేవలను అందించబోతోంది. అలాగే రానున్న 18 నుంచి 24 నెలల్లో బిగ్‌బాస్కెట్ ఐపీఓకు కూడా వస్తుందని హరిమీనన్ తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో జొమాటో-బ్లింకిట్, స్విగ్గీ-ఇన్‌స్టామార్ట్ క్విక్ కామర్స్ విభాగంలో దూసుకుపోతున్నాయి. మహా నగరాల్లో కేవలం 10 నిమిషాల్లోనే ఆర్డర్ చేసిన వస్తువులను డెలివరీ చేస్తున్నాయి. త్వరలో బిగ్‌బాస్కెట్ కూడా ఆయా విభాగాల్లో తన వ్యాపారాన్ని విస్తరించాలని భావిస్తోంది. దేశీయ క్విక్ కామర్స్ పరిశ్రమ రాబోయే రోజుల్లో మరింత వృద్ధి చెందుతుందని అంచనాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలో బిగ్‌బాస్కెట్ కూడా తన వ్యాపారాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది.

# స్పోర్ట్స్

# ప్రాక్టీస్ మొదలు పెట్టిన హిట్ మ్యాన్

ఇప్పటికే భారత్ సెమీ ఫైనల్ కు చేరిన వేళ.. వన్డే, టెస్టు కెప్టెన్ రోహిత్ శర్మ గాయంపై స్పష్టమైన అప్డేట్ వచ్చింది. తను గాయం నుంచి వేగంగా కోలుకుంటున్నాడని, అతని గురించి కంగారు పడాల్సిన అవసరం లేదని టీమ్ మేనేజ్మెంట్ పేర్కొంది. ఆల్రెడీ ప్రాక్టీస్ మొదలు పెట్టిన హిట్ మ్యాన్, నెట్ లో శ్రమిస్తున్నాడని సహాయక కోచ్ ర్యాన్ టెన్ డస్కటే తెలిపాడు. తనకి గాయం నుంచి ఎలా కోలుకోవాలో తెలుసని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకున్నాడని వివరించాడు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో వరుస విజయాలతో భారత్ తో పాటు న్యూజిలాండ్ గ్రూప్-ఏ నుంచి సెమీస్ కి చేరిన సంగతి తెలిసిందే. ఈ రెండు జట్ల మధ్య ఆదివారం కీలకమైన గ్రూప్ మ్యాచ్ జరుగుతుంది. కివీస్ తో




జరిగే మ్యాచ్ లో రోహిత్ ఆడనుండటం ఖాయంగా కనిపిస్తోంది. ఈ మ్యాచ్ లో విజేతగా నిలిచిన జట్టు గ్రూప్ టాపర్ గా నిలుస్తుంది. దీంతోనే సెమీస్ లో ఎవరితో ఎవరు పోటీపడాలనే విషయం స్పష్టత వస్తుంది. ఇక గ్రూపు బి నుంచి ఆస్ట్రేలియా సెమీస్ కు చేరగా, సౌతాఫ్రికా అదే దారిలో ఉంది. ఇంగ్లాండ్ తో మ్యాచ్ ఫలితం తర్వాత దీనిపై స్పష్టత వస్తుంది.

# షమీకి రెస్ట్.. హర్షదీప్‌కు ఛాన్స్ !



**దుబాయ్:**
భారత ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ కి రెస్ట్ ఇవ్వనున్నారు. చాంపియన్స్ ట్రోఫీలో న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో.. షమీ లేకుండానే టీమిండియా బరిలోకి దిగనున్నది. పాకిస్థాన్‌తో మ్యాచ్ సమయంలో షమీ పిక్క కండరాలు పట్టేసిన విషయం తెలిసిందే. దీంతో అతనికి రెస్ట్ ఇవ్వాలని టీం మేనేజ్మెంట్ ఆలోచిస్తున్నది. అయితే ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో.. షమీ స్థానంలో హర్షదీప్‌కు ఛాన్స్ ఇవ్వాలని భావిస్తున్నారు.బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కల్ సమక్షంలో హర్షదీప్ శుక్రవారం ప్రాక్టీస్ చేశాడు. ప్రాక్టీస్ సెషన్‌లో హర్షదీప్ 13 ఓవర్లు బౌల్ చేశాడు. షమీ మాత్రం 7 ఓవర్లు బౌల్ చేసినట్లు తెలుస్తోంది. పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం మూడు ఓవర్లు వేయగానే.. షమీ తన కుడి కాలి కోసం ఫిజియో చికిత్స తీసుకున్నాడు. అయితే కీలకమైన సెమీస్ మ్యాచ్ ముందు.. షమీకి రెస్ట్ ఇవ్వాలని టీం మేనేజ్మెంట్ భావిస్తున్నది. బౌలింగ్ లైనప్‌లో స్వల్పంగా తేడా ఉంటుందని అసిస్టెంట్ కోచ్ రియాన్ డోస్చే తెలిపారు.

# సచిన్ రికార్డులపై కోహ్లీ కన్ను!!

టీమిండియా - న్యూజిలాండ్ మధ్య మ్యాచ్ జరగనున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పటికే విరాట్ కోహ్లీ.. పాకిస్థాన్ పై సెంచరీ బాది ఫామ్ లో వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అతడు కివీస్ తో జరిగే మ్యాచ్ లో.. దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్ సాధించిన పలు రికార్డులను బ్రేక్ చేసే అవకాశం వచ్చింది. అవేంటంటే?కోహ్లీ న్యూజిలాండ్ తో జరగబోయే మ్యాచ్ 300వ వన్డే. ఇప్పటి వరకు 299 వన్డే మ్యాచులు 287 ఇన్నింగ్స్ ఆడాడు. 58.21 యావరేజ్ తో, 9.42 స్ట్రైక్ రేట్ తో 14,085 పరుగులు చేశాడు. అందులో 51 సెంచరీలు, 73 అర్ధ శతకాలు ఉన్నాయి. వన్డేల్లో న్యూజిలాండ్ పై అత్యధిక పరుగులు చేసిన టీమిండియా ఆటగాడిగా నిలుస్తాడు కోహ్లీ. ప్రస్తుతం సచిన్ తెందూల్కర్ కివీస్ పై 1750 పరుగులతో భారత్ తరపున అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. న్యూజిలాండ్ పై అతడు 42 వన్డేల్లో ఐదు శతకాలు, ఎనిమిది అర్ధ శతకాలు బాదాడు. కోహ్లీ.. 31 వన్డేల్లో 6 సెంచరీలు, 9 హాఫ్ సెంచరీలతో 1645 రన్స్ సాధించాడు. కాబట్టి మరో 106 పరుగులు విరాట్ చేస్తే సచిన్ రికార్డ్ బ్రేక్




అవుతుంది. మొత్తంగా రికీ పాంటింగ్ 1971 పరుగులు, 51 మ్యాచ్‌లతో అగ్ర స్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్ మ్యాచ్‌లో మరో 85 పరుగులు సాధిస్తే న్యూజిలాండ్‌పై 3 వేల పరుగులు పూర్తి చేసుకున్న ఐదో బ్యాటర్ గా నిలుస్తాడు కోహ్లీ. టీమిండియా తరఫున సచిన్ తెందుల్కర్ (3,345) ఒక్కడే ఈ మార్క్ ను అందుకున్నాడు. ఓవరాల్ గా ఈ జాబితాలో రికీ పాంటింగ్ (3,145) టాప్ లో ఉన్నాడు. న్యూజిలాండ్‌పై ఇప్పటివరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 55 మ్యాచ్‌లు ఆడాడు కోహ్లీ. 47.01 యావరేజ్ తో 2,915 పరుగులు సాధించాడు. ఇందులో తొమ్మిది శతకాలు, 15 అర్ధ శతకాలు ఉన్నాయి. కాగా, ఈ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో గ్రూప్ ఏ నుంచి ఇప్పటికే న్యూజిలాండ్ - ఆసీస్ జట్లు సెమీస్ కు అర్హత సాధించాయి. తాజా మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టే గ్రూప్-ఎలో అగ్రస్థానాన్ని దక్కించుకుంటుంది.



# కీరవాణి లైవ్ కన్సర్ట్ కోసం ఎదురుచూస్తున్నా : రాజమౌళి

ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి లైవ్ కన్సర్ట్ చేయబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. 'నా టూర్ ఎం.ఎం.కె' పేరిట ఈ కన్సర్ట్ చేయనుండగా.. మార్చి 22న సాయంత్రం 7గంటలకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈ ఈవెంట్ ప్రారంభం కానుంది. అయితే ఈ వేడుకను సక్సెస్ చేయాలని కోరుతూ ఆయన తమ్ముడు దిగ్గజ దర్శకుడు రాజమౌళి ఒక వీడియో విడుదల చేశారు. ఈ వీడియోలో అభిమానుల నుంచి సపోర్ట్‌ను కోరారు. మార్చి 22 కోసం నేను చాలా ఆతృతగా ఎదురుచూస్తున్నాను. ఎందుకంటే ఆరోజు అన్నయ్య ఎం.ఎం. కీరవాణి కన్సర్ట్ ఉంది. ఈ కన్సర్ట్‌లో నా సినిమాలోని పాటలతో పాటు ఆయన సంగీతం అందించిన పాటలను పాడనున్నారు. నా డిమాండ్ ఏంటి అంటే ఆయన ఒ.ఎస్.టి (ఒరిజినల్ సౌండ్ ట్రాక్)లూ ఉండాలనేది నా డిమాండ్. ఎందుకంటే ఆయన రీ రికార్డింగ్ అద్భుతంగా ఉంటుంది. ఆయన పాటలు ఎంత ఫేమసో అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌లు కూడా అంతే ఫేమస్. ఆ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌లను, ఒ.ఎస్.టి లను లైవ్‌లో ప్లే చేయాలని కోరుకుంటున్నా అంటూ రాజమౌళి చెప్పుకోచ్చాడు.

# ప్రత్యేక పాత్రలతో అలరిస్తున్న సుప్రీత



సురేఖావాణి కూతురు సుప్రీత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియాలో ఈ బ్యూటీకి మంచి క్రేజ్ ఉంది. తన వీడియోలు, ఫొటోలతో కుర్రాళ్లను కవ్విస్తుంది. అంతే కాదు ఈ మధ్య గ్లామర్ షోతో అభిమానులను కవ్విస్తుంది. హీరోయిన్స్‌ను మించి తన అందాలతో మతిపోగొడుతోంది. ఎన్నో సినిమాల్లో అద్భుతమైన పాత్రలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. సూపర్ హిట్ సినిమాల్లో మంచి పాత్రలు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమె మరెవరో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా తనకంటూ మంచి క్రేజ్ సొంతం చేసుకున్న సురేఖ వాణి. ఆమె కూతరు సుప్రీత త్వరలోనే హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వనుంది. సురేఖావాణి కూతురు సుప్రీత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియాలో ఈ బ్యూటీకి మంచి క్రేజ్ ఉంది. తన వీడియోలు, ఫొటోలతో కుర్రాళ్లను కవ్విస్తుంది. అంతే కాదు ఈ మధ్య గ్లామర్ షోతో అభిమానులను కవ్విస్తుంది. హీరోయిన్స్ ను మించి తన అందాలతో మతిపోగొడుతోంది. త్వరలోనే ఈ చిన్నది హీరోయిన్‌గా సినిమా చేస్తుంది. మొనీమధ్యే అమర్ దీప్ హీరో గా ఓ సినిమాను అనౌన్స్ చేశారు. ఈ సినిమా షూటింగ్ ఇటీవలే మొదలైంది. త్వరలోనే ఈ సినిమా నుంచి అప్డేట్స్ ఇవ్వనున్నారు. ఇక తాజాగా సురేఖావాణి సుప్రీత వెకేషన్స్ కు వెళ్లారు. అక్కడి నుంచి గ్లామరస్ ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తున్నారు. సురేఖ వాణి, సుప్రీత ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. సుప్రీతా అందాలకు కుర్రాళ్ళు ఫిదా అయ్యారు. తాజాగా సుప్రీతా షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. తన అందాలతో కుర్రాళ్ళ మతిపోగొట్టింది ఈ చిన్నది. పింక్ కలర్ డ్రస్‌లో ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ఈ క్యూట్ ఫోటోలకు నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

# క్రేజీ పిక్స్‌తో మతిపోగొడుతున్న సీరత్‌కపూర్



రన్ రాజా రన్ సినిమా తర్వాత కొన్ని సినిమాలు చేసింది.. కానీ.. ఈ ముద్దుగుమ్మకు అనుకున్నంతగా గుర్తింపు రాలేదు. దీంతో అవకాశాలు సైతం తగ్గిపోయాయి. అయితే ఈ హీరోయిన్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ అయ్యింది. 2015లో సందీప్ కిషన్ నటించిన టైగర్ చిత్రంలో నటించింది. ఇక ఆ తర్వాత కొలంబస్, రాజు గారి గది 2, టచ్ చేసి చూడు, ఒక్క క్షణం చిత్రాల్లో నటించింది. శర్వానంద్ హీరోగా నటించిన రన్ రాజా రాజా రన్ సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది క్రేజీ బ్యూటీ సీరత్ కపూర్. ఆ తర్వాత ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో మెప్పించింది. ఆతర్వాత తెలుగులో ఎక్కడా కనిపించలేదు ఈ చిన్నది. రన్ రాజా రన్ సినిమా తర్వాత కొన్ని సినిమాలు చేసింది.. కానీ.. ఈ ముద్దుగుమ్మకు అనుకున్నంతగా గుర్తింపు రాలేదు. దీంతో అవకాశాలు సైతం తగ్గిపోయాయి. అయితే ఈ హీరోయిన్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ అయ్యింది. 2015లో సందీప్ కిషన్ నటించిన టైగర్ చిత్రంలో నటించింది. ఇక ఆ తర్వాత కొలంబస్, రాజు గారి గది 2, టచ్ చేసి చూడు, ఒక్క క్షణం చిత్రాల్లో నటించింది. అయితే ఈ సినిమాలన్ని బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్స్ కాగా.. ఈ అమ్మడుకు మాత్రం మంచి క్రేజ్ వచ్చింది. ఆ తర్వాత మరో సినిమాలో కనిపించలేదు. ఆమె చివరిసారిగా మా వింత గాధ వినుమా సినిమాలో నటించింది. ఇక ఇటీవల హిందీలో మారిచ్ అనే క్రైం థ్రిల్లర్ లో నటించింది. సీరత్ కపూర్ కేవలం నటి మాత్రమే కాదు.. మంచి డాన్సర్ కూడా బాలీవుడ్ ఇండస్ట్రీలో కొరియోగ్రాఫర్ గా చేసిన సీరత్ కపూర్.. ఆ తర్వాత నటనపై ఆసక్తితో హీరోయిన్ గా అడుగుపెట్టింది. ఇదిలా ఉంటే.. తాజాగా ఆమె షేర్ చేసిన లేటేస్ట్ గ్లామర్ ఫోటోస్ వైరలవుతున్నాయి. ఈ ఫోటోలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు.




# కన్నప్ప నుంచి మరో టీజర్ రిలీజ్

మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. ఈ సినిమాలో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తుండగా.. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నాడు. ఏప్రిల్ 25న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఈ చిత్రం. ఇప్పటికే వరుస ప్రమోషన్స్ చేస్తున్న ఈ చిత్రం తాజాగా మరో టీజర్‌ను వదిలింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. ఈ సినిమాలో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తుండగా.. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నాడు. ఏప్రిల్ 25న వరల్డ్ వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఈ చిత్రం. ఇప్పటికే వరుస ప్రమోషన్స్ చేస్తున్న ఈ చిత్రం తాజాగా మరో టీజర్‌ను వదిలింది. నాస్తికుడిగా ఉన్న కన్నప్ప శివ భక్తుడిగా ఎలా మారాడు అనే కథతో ఈ సినిమా రాబోతున్నట్లు టీజర్ చూస్తే అర్థమవుతుంది. ఇక టీజర్ చివరిలో రుద్రుడిగా ప్రభాస్ లుక్స్ గూజ్ బంప్స్ తెప్పించాయి. హిస్టారికల్ కం మైథాలాజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్నారు. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు.

# నా 'ఎక్స్' అకౌంట్ హ్యాక్ అయ్యింది సింగర్ శ్రేయా ఘోషల్

ఇండియన్ స్టార్ ప్లే బ్యాక్ సింగర్ శ్రేయా ఘోషల్ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా హ్యాక్ అయినట్లు తెలిపింది. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక పోస్ట్ పెట్టింది. నా ప్రియమైనా స్నేహితులకు & అభిమానులకు ఒక విజ్ఞప్తి. నా ట్విట్టర్ / ఎక్స్ ఖాతా ఫిబ్రవరి 13 నుంచి హ్యాక్ అయింది. ఈ విషయంలో ఎక్స్ టీమ్‌ను సంప్రదించేందుకు నా వంతు ప్రయత్నం చేశాను. కానీ కొన్ని కొన్ని ఆటో జనరేటెడ్ స్పందనల తప్ప మరేమీ రాలేదు. ఇప్పటికీ ఖాతా నా ఆధీనంలోకి రాలేదు. దయచేసి నా ఖాతా నుంచి వచ్చే ఏ లింక్‌పై క్లిక్ చేయవద్దు అలాగే ఏ పోస్ట్‌ని నమ్మవద్దు. నా ఖాతా మళ్లీ తిరిగి వస్తే.. నేనే వ్యక్తిగతంగా వీడియో ద్వారా మీకు అప్‌డేట్ చేస్తానంటూ శ్రేయా ఘోషల్ చెప్పుకోచ్చింది.



Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492